నవంబరు రేషన్ ముందుగానే పంపిణీ: జేసీ జాహ్నవి

అనకాపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి):

తుఫాన్ దృష్ట్యా సీఎం చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు జిల్లాలో నవంబరు నెలకు సంబంధించిన రేషన్ సరుకులకు ముందుగానే అందిస్తున్నట్టు జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రేషన్ డిపోలకు ఇప్పటికే బియ్యం, పంచదార ఇతర సరుకులు చేరాయని, వెంటనే పంపిణీని ప్రారంభించాలని రేషన్ డీలర్లను ఆదేశించినట్టు చెప్పారు. రానున్న మూడు రోజుల్లో పెట్రోలు, డీజిల్ కొరత రాకుండా అన్ని బంకుల్లో తగిన నిల్వలు ఉండేలా చర్యలు చేపట్టామని జేసీ తెలిపారు.



చోడవరం మండలం చాకిపల్లి, కన్నంపాలెం ప్రాంతంలో నీటి మునిగిన వరి, చెరకు పొలాలు



అనకాపల్లి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న శారదా నది



కోటవురట్ల మండలం కైలాసపట్నంలో రోడ్డుపై కూలిన భారీ వృక్షం

కుండపోత!

తుఫాన్ ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు

- ఈదురు గాలులతో కూలిన చెట్లు, విద్యుత్ స్తంభాలు
- వెంటనే సహాయక చర్యలు చేపట్టిన అధికారులు

- జలాశయాల్లోకి భారీగా వరద.. గేట్లు ఎత్తివేత
- ఉధృతంగా ప్రవహిస్తున్న నదులు, వాగులు
- లోతట్టు ప్రాంతాల్లో నీట మునిగిన పంటలు
- జలమయమైన పలు కాలనీలు
- సముద్ర తీర గ్రామాల ప్రజలు, పూరిళ్ల నివాసితులు పునరావాస కేంద్రాలకు తరలింపు
- జన జీవనానికి తీవ్ర అంతరాయం



సబ్బవరం-గుల్లేపల్లి రోడ్డులో ఆదిరెడ్డిపాలెం వద్ద కాజ్‌వే మీదుగా ప్రవహిస్తున్న గెడ్డ

అనకాపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి-న్యూస్‌నెట్‌వర్క్):

'మొంథా' తీవ్ర తుఫాన్ జిల్లాపై తీవ్ర ప్రభావం చూపుతున్నది. సోమవారం అర్ధరాత్రి నుంచి జిల్లా వ్యాప్తంగా ముసురు వాతావరణం నెలకొంది. దఫదఫాలుగా భారీ వర్షం కురుస్తున్నది. లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. నదులు, వాగులు, గెడ్డలు వరద నీటితో ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. అన్ని జలాశయాల్లోకి వరద పోటెత్తడంతో స్పిల్‌వే గేట్లు ఎత్తి, అదనపు నీటిని నదుల్లోకి విడుదల చేస్తున్నారు. భారీ వర్షంతోపాటు ఈదురు గాలులు వీస్తుండడంతో పలుచోట్ల చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది వెంటనే రంగంలోకి దిగి చెట్లను తొలగిస్తున్నారు. కూలిన విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేసి సరఫరాను పునరుద్ధరిస్తున్నారు. ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుండడంతో గ్రామీణ రహదారులు పాడైపోతున్నాయి. లోతట్టు ప్రాంతాల్లోని భూముల్లో వరి, చెరకు, ఇతర పంటలు నీటమునిగాయి. జిల్లాలోని వివిధ మండలాల్లో 74 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. సముద్ర తీర గ్రామాలు, పూరిపాకలు, శిథిలావస్థకు చేరిన ఇళ్లల్లో నివాసం వుంటున్న వారిని సమీపంలోని పునరావాస కేంద్రాలకు తరలించారు. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రికి భోజనాలు పెడుతున్నారు. ఆయా కేంద్రాలను అధికారులు సందర్శించి ఏర్పాట్లను పరిశీలిస్తున్నారు. తుఫాన్ తీరం దాటిన తరువాత అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం వెల్లడించడంతో అప్రమత్తమైన జిల్లా యంత్రాంగం ముందస్తు చర్యల్లో నిమగ్నమైంది.

కాగా సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షాలకు గొలుగొండ మండలం డొంకాడ గ్రామ ప్రధాన రహదారికి గండి పడింది. ఈ గ్రామంలో 35 కుటుంబాలకు చెందిన 120 మందిని పునరావాస కేంద్రానికి తరలించారు. రోలుగుంట, రావికమతం మండలాల్లో కొండశిఖర గ్రామాల గిరిజనులను దిగువున వున్న గ్రామాల్లోని పునరావాస కేంద్రాలకు తరలించారు. ఎస్పీ తుహిన్ సిన్హా అనకాపల్లి మండలం వెంకుపాలెం, కుంచంగి పరిసరాల్లో పర్యటించారు. వెంకుపాలెం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వెదుళ్లగెడ్డను పరిశీలించి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జాతీయ రహదారిపై విశాఖపట్నం వైపు నుంచి రాజమహేంద్రవరం వైపు వెళ్లే అన్ని రకాల వాహనాలను మంగళవారం రాత్రి ఏడు గంటల నుంచి ఎంపిక చేసిన ప్రదేశాల్లో పోలీసులు నిలిపివేస్తున్నారు. కలెక్టర్ విజయకృష్ణన్, జేసీ జాహ్నవి, ఎస్పీ తుహిన్ సిన్హా అధికారులతో సమీక్షలు నిర్వహిస్తూ అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు సహాయక చర్యలు చేపట్టేందుకు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు.

సోమవారం రాత్రి కుండపోత...

మొంథా తుఫాన్ ప్రభావంతో సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు జిల్లా వ్యాప్తంగా ఈదురు గాలులతో భారీ వర్షం కురిసింది. అత్యధికంగా సబ్బవరం మండలంలో 153.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. రాంబిల్లి మండలంలో 139.6 మి.మీ., పరవాడలో 131.6, అచ్యుతాపురంలో 108, కె.కోటపాడులో 90.8, మునగపాకలో 97.2, చోడవరంలో 94.4, నక్కపల్లిలో 91.4, బుచ్చెయ్యపేటలో 82.2, కశింకోటలో 89.2, అనకాపల్లిలో 84.4, ఎలమంచిలిలో 83.8, ఎస్.రాయవరంలో 76.6, రావికమతంలో 74.6, రోలుగుంటలో 71.2, పాయకరావుపేటలో 61.8, చీడికాడలో 48.2, నర్సీపట్నంలో 53.4, మాకవరపాలెంలో 48.6, కోటవురట్లలో 46.4, గొలుగొండలో 46.8, దేవరాపల్లిలో 32.2, మాడుగులలో 35.4, నాతవరంలో 34.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

కాగా మంగళవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు జిల్లాలో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. కె.కోటపాడు మండలంలో 38.4 మి.మీ.లు ... మిగతా 8వ పేజీలో

తక్షణ సాయానికి సిద్ధంగా ఉండాలి

అధికారులకు కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశం

- కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి మండలాల అధికారులతో సమీక్ష



కమాండ్ కంట్రోల్ రూమ్‌లో కలెక్టర్ విజయకృష్ణన్, జేసీ జాహ్నవి

అనకాపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి):

ప్రజల భద్రతకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందని, తుఫాన్ ప్రభావంతో ఎటువంటి విపత్కర పరిస్థితులు ఏర్పడినా.. వెంటనే సహాయ చర్యలు చేపట్టేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. మంగళవారం ఆమె జేసీ జాహ్నవితో కలిసి కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి తుఫాన్ పునరావాస కేంద్రాల్లో ఏర్పాట్లు, ఇతరత్రా సహాయక చర్యలను పర్యవేక్షించారు. పునరావాస కేంద్రాలకు ప్రజలను తరలించడానికి రవాణా సదుపాయం, ఆయా కేంద్రాల్లో విద్యుత్, తాగునీరు, ఆరోగ్య సదుపాయాల గురించి పలు మండలాల అధికారులను అడిగి తెలుసుకున్నారు. తుఫాన్, భారీ వర్షాలు, వరద వల్ల ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని చెప్పారు. మండలా ప్రత్యేకాధికారులు ఎప్పటికప్పుడు సమాచారం అందించి సహాయం అందేలా చూడాలన్నారు. జేసీ జాహ్నవి మాట్లాడుతూ సహాయక బృందాలు, అత్యవసర సర్వీసులు 24 గంటలూ సేవలు అందించేందుకు సిద్ధంగా ఉండాలన్నారు.

తక్షణ సాయానికి కంట్రోల్ రూమ్‌లు

కలెక్టరేట్‌లో ఫోన్ నంబర్లు:
08924-222888, 08924-226599,
08924-225999

అనకాపల్లి ఆర్డీఓ కార్యాలయం:
08924-223316

నర్సీపట్నం ఆర్డీఓ కార్యాలయం:
08932-224420

ఈపీడీసీఎల్ ఫోన్ నంబర్లు..
అనకాపల్లి: 9490610023
కశింకోట : 8333811271, 8333811272
నర్సీపట్నం : 9491030723

జాతీయ రహదారిపై రవాణా వాహనాలు నిలిపివేత

- తుఫాన్ నేపథ్యంలో పోలీసు అధికారులు అత్యవసర చర్యలు



ఎస్.రాయవరం మండలం అడ్డరోడ్డు సమీపంలో లారీలను నిలిపివేసిన పోలీసులు

కశింకోట/ ఎస్.రాయవరం/ నక్కపల్లి/ పాయకరావుపేట రూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి):

మొంథా తీవ్ర తుఫాన్ నేపథ్యంలో జాతీయ రహదారిపై ఎటువంటి ప్రమాదాలు జరగకుండా పోలీసు అధికారులు అత్యవసర చర్యలు చేపట్టారు. విశాఖపట్నం వైపు నుంచి రాజమహేంద్రవరం వైపు వెళ్లే అన్ని రకాల రవాణా వాహనాలను జిల్లాలోని పలు

నక్కపల్లి మండలం వేంపాడు టోల్ ప్లాజా వద్ద ఆపేసిన లారీలు



ప్రాంతాల్లో మంగళవారం రాత్రి ఏడు గంటల నుంచి నిలుపుదల చేస్తున్నారు. ఆర్టీసీ, ప్రైవేటు ట్రావెల్స్ బస్సులను మహిళలకు మరుగుదొడ్ల సదుపాయం వున్న చోట ఆపివేస్తున్నారు. కశింకోట మండలం నూతనగుంటపాలెం, ఎస్.రాయవరం మండలం అడ్డరోడ్డు సమీపంలో ఒక దాబా వద్ద, నక్కపల్లి మండలం వేంపాడు టోల్ ప్లాజా సమీపంలో, పాయకరావుపేట మండలం నామవరం, పి.ఎల్.పురం, పాయకరావుపేటలోని చెక్కా వారి బంకుల వద్ద నిలుపుదల చేశారు. తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు, ఈదురు గాలులు వీస్తాయని వాతావరణ శాఖ ... మిగతా 8వ పేజీలో

రైతులు అప్రమత్తంగా ఉండాలి

వరి పొలాల్లో అధిక నీటిని బయటకు పంపాలి

- ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ ముకుందరావు



రావికమతం మండలం కొమిరలో నేలవాలిన వరిపైరు

అనకాపల్లి అగ్రికల్చర్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి):

మొంథా తుఫాన్ కారణంగా జిల్లాలో రాగల రెండు 24 గంటల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం వున్నందున పంట పొలాలు ముంపునకు గురికాకుండా రైతులు చర్యలు చేపట్టాలని అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ డాక్టర్ సిహెచ్. ముకుందరావు సూచించారు. మంగళవారం సాయంత్రం వరకు కొన్ని లోతట్టు ప్రాంతాల్లో మాత్రమే వరి, మరికొన్ని పంటలు నీటమునిగినట్టు సమాచారం వుందన్నారు. తుఫాన్ ప్రభావంపై మంగళవారం జరిగిన శాస్త్రవేత్తలు, అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రైతులు వరి పొలాల్లో అధికంగా చేరిన నీటిని ఎప్పటికప్పుడు బయటకు పంపుకోవాలని చెప్పారు. జిల్లాలో చాలా ప్రాంతాల్లో వరి పిలక దశలో ఉందని, అందువల్ల భారీ వర్షాలకు నష్టం తక్కువ ఉంటుందన్నారు. గింజకట్టే దశ, కోత దశలో వుంటే నష్టం జరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. వరి కంకులు పాలుపోసుకునే దశలో ఉంటే పొలంలో నీటిని తొలగించాలని, ఒకవేళ తెగుళ్ల సోకితే వీటి నివారణకు వర్షాలు తగ్గిన వెంటనే ఎకరానికి 200 మిల్లీమీటర్ల ప్రాపికొనజోల్ మందును 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. గింజ గట్టిపడే దశలో ఉంటే వర్షపు నీటిని తొలగించి గింజ మొలకెత్తకుండా లీటరు నీటికి 50 గ్రాముల చొప్పున ఉప్పు ఆ ద్రావణాన్ని కంకులపై పిచికారీ చేయాలన్నారు.

రిజర్వాయర్లకు పోటెత్తిన వరద

బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర తుఫాన్ ప్రభావంతో జిల్లాలో సోమవారం రాత్రి నుంచి కురుస్తున్న భారీ వర్షాలతో జలాశయాల్లోకి వరద పోటెత్తుతున్నది. దీంతో జలవనరుల శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. రిజర్వాయర్లకు ఎటువంటి ముప్పు వాటిల్ల కుండా ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఆయా జలాశయాల స్పిల్‌వే గేట్ల నుంచి భారీ ఎత్తున వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. దీంతో శారదా, బొడ్డేరు, పెద్దేరు, తాండవ, సర్పా, వరహా నదుల్లో వరద ప్రవాహం పెరిగింది. నదులకు ఇరువైపులా వున్న గ్రామాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు.

అధికారులు అప్రమత్తం

- స్పిల్‌వే గేట్లు ఎత్తి.. దిగువకు నీరు విడుదల
- ఉధృతంగా ప్రవహిస్తున్న నదులు



తాండవ రిజర్వాయర్ స్పిల్‌వే గేట్లు ఎత్తడంతో గుమ్మిడిగొండ వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న నది

రైవాడ జలాశయంలోకి 3 వేల క్యూసెక్కుల వరద

దేవరాపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైవాడ జలాశయంలోకి సమ్మెద, పిన కోట గెడ్డల నుంచి మూడు వేల క్యూసెక్కుల వరద



పెద్దేరు స్పిల్‌వే గేటు నుంచి నదిలోకి విడుదలవుతున్న నీరు

నీరు చేరుతుంది. గరిష్ఠ నీటిమట్టం 114 మీటర్లు కాగా మంగళవారం సాయంత్రం 112.3 మీటర్లుగా నమోదైంది. రిజర్వాయర్‌లోకి వరద ప్రవాహం పెరుగుతుండడంతో స్పిల్‌వే గేట్లు ఎత్తి 2,700 క్యూసెక్కుల నీటిని శారదా నదిలోకి విడుదల చేస్తుననట్టు జలాశయం డీఈఈ సత్యంనాయుడు తెలిపారు. దిగువున వున్న తామరబ్బ వద్ద వంతెనను తాకుతూ శారదా నది ప్రవహిస్తున్నది.

తాండవ నుంచి 2,472 క్యూసెక్కులు విడుదల

నాతవరం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాండవ జలాశయంలోకి వరద ప్రవాహం పెరుగుతున్నది. గరిష్ఠ నీటిమట్టం 380 అడుగులు కాగా మంగళవారం 1,220 క్యూసెక్కుల ఇన్‌ఫ్లోతో 377.6 అడుగులు వుంది. తుఫాన్ కారణంగా భారీ వర్షాలు కురుస్తుండడంతో రెండు స్పిల్‌వే గేట్లు ఎత్తి 2,472 క్యూసెక్కుల నీటిని నదిలోకి విడుదల చేస్తున్నట్టు ప్రాజెక్టు డీఈఈ అనురాధ, ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కరక సత్యనారాయణ చెప్పారు. మంగళవారం రాత్రికి ఇన్‌ఫ్లో పెరిగితే స్పిల్‌వే గేట్ల నుంచి అవుట్‌ఫ్లోను మరింత పెంచుతామన్నారు. అందువల్ల తాండవ నదికి ఇరువైపులా వున్న గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వారు కోరారు.

పెద్దేరుకు పెరుగుతున్న వరద

మాడుగుల రూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పెద్దేరు జలాశయానికి వరద తాకిడి పెరిగింది. గరిష్ఠ నీటిమట్టం 137 మీటర్లు కాగా మంగళవారం ఉదయం 467 క్యూసెక్కుల ఇన్‌ఫ్లోతో 134.6 మీటర్లకు చేరింది. అధికారులు స్పిల్‌వేలో ఒక గేటు తెరిచి 300 క్యూసెక్కుల నీటిని నదిలోకి విడిచిపెడుతున్నారు. సాయంత్రానికి ఇదే ఇన్‌ఫ్లో కొనసాగడంతో నీటి విడుదలను 400 క్యూసెక్కులకు పెంచారు. తుఫాన్ వర్షాలతో ఇన్‌ఫ్లో మరింత ఎక్కువైతే మరో గేటు ఎత్తుతామని, రిజర్వాయర్‌లోకి చేరుతున్న వరద నీటికి అనుగుణంగా గేట్లు ఎత్తి నదిలోకి నీటిని విడుదల చేస్తామని డీఈఈ చిన్నంనాయుడు తెలిపారు.

రావికమతం మండలం కల్యాణపులోవ జలాశయానికి వరద ప్రవాహం క్రమేపీ పెరుగుతున్నది. అధికారులు స్పిల్‌వేగేట్లు ఎత్తి 200 క్యూసెక్కుల నీటిని సర్పా నదిలోకి వదులుతున్నారు.

కోనాం జలాశయం నుంచి 500 క్యూసెక్కులు..

చీడికాడ, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో మండలంలోని కోనాం జలాశయంలోకి 500 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతున్నది. గరిష్ఠ నీటిమట్టం 101.25 మీటర్లుకాగా మంగళవారం 98.75 మీటర్ల వద్ద స్థిరంగా వుంచుతూ స్పిల్‌వే గేట్లను ఎత్తి 500 క్యూసెక్కుల నీటిని బొడ్డేరు నదిలోకి విడిచిపెడుతున్నారు.

తీవ్రరూపం దాల్చిన శారదా నది

అనకాపల్లి టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో పలు మండలాల్లో భారీ వర్షాలు కురుస్తుండడంతో శారదా నదిలో వరద ప్రవాహం గంట గంటకూ పెరుగుతున్నది. రైవాడ, పెద్దేరు, కోనాం జలాశయాల నుంచి నీటి విడుదలతోపాటు తాచేరు, బొడ్డేరు, తదితర గెడ్డలన్నీ శారదా నదిలో కలవడంతో ఉధృతంగా ప్రవహిస్తున్నది. సోమవారంతో పోల్చితే మంగళవారం నీటి ఉధృతి మరింత పెరిగింది. అనకాపల్లి డీఎస్పీ ఎం. శ్రావణి, గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర శారదా నది వంతెన వద్దకు వెళ్లి పరిశీలించారు.



మునగపాక గొల్లపేటలో కూలిన పెంకిటిల్లు



కోటవురట్ల: గొట్టివాడ ఘాట్‌రోడ్డు వద్ద ప్రవహిస్తున్న వరహానది



మునగపాక: ఒంపోలు గ్రామం వద్ద కూలిన భారీ వృక్షం



రాంబిల్లి: కొత్తూరు వద్ద పాత వంతెనను ఆనుకొని ప్రవహిస్తున్న మేజర్ శారదానది

కొనసాగిన వర్షాలు

ఉధృతంగా ప్రవహించిన మైనర్, మేజర్ శారదా నదులు



ఎలమంచిలి ఎన్టీఆర్ కాలనీ ప్రజలకు ధైర్యం చెబుతున్న రాష్ట్ర రోడ్ల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు



అచ్యుతాపురం: పూడిమడక పునరావాస కేంద్రంలో ఏర్పాట్లపై ఆరా తీస్తున్న జిల్లా ప్రత్యేకాధికారి వినయ్ చంద్

- కూలిన చెట్లు, ఇళ్లు, విద్యుత్తు స్తంభాలు
- యుద్ధపాతిపదికన చెట్లు తొలగింపు
- పునరావాస కేంద్రాలకు ప్రజలను భారీగా తరలింపు
- ఎలమంచిలి, పాయకరావుపేట నియోజకవర్గాల్లో పర్యటించిన ప్రత్యేకాధికారి, అధికారులు, పోలీసులు
- విస్తృతంగా పర్యటించిన ఎమ్మెల్యే ప్రగడ, కూటమి నేతలు
- పలు చోట్ల నీట మునిగిన పంట పొలాలు

మునగపాక, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో సముద్ర తీరం అల్లకల్లోలంగా మారింది. సముద్రం ముందుకొచ్చింది. అలలు ఎగిసిపడ్డాయి. ఈదురుగాలుల కూడిన వర్షం కురిసింది. పలు చోట్ల చెట్లు, ఇళ్లు, విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు, కూటమి నేతలు గ్రామాల్లో పర్యటించి ప్రజలకు ధైర్యం చెప్పారు. పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి బాధితులకు భోజన,వసతులు ఏర్పాటు చేశారు.

మండల కేంద్రం మునగపాకలోని గొల్లపేటలో మంగళవారం మొల్లి లక్ష్మి, మొల్లి వెంకటలక్ష్మిలకు చెందిన రెండు ఇల్లు కూలిపోయాయి. సర్పంచ్ దిమ్మల అప్పారావు, ఈవో త్రిమూర్తులు వాటిని పరిశీలించారు. అదే విధంగా ఒంపోలులో రోడ్డుకడ్డంగా కూలిపోయిన భారీ చెట్టును యుద్ధప్రాతిపదికన అధికారులు తొలగించారు. తిమ్మరాజుపేట-వాడ్రాపల్లి రోడ్డుపై నుంచి నీరు పారుతోంది. పలుచోట్ల పొలాలు నీట మునిగాయి. నాగులాపల్లి గ్రామంలో నీట మునిగిన పొలంలో దిగి టీడీపీ నాయ కుడు దొడ్డి శ్రీనివాసరావు పరిశీలించారు. ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ ఆదేశాలతో క్షేత్రస్థాయి పరిశీలన చేస్తున్నామని చెప్పారు.

రాంబిల్లిలో..

తుఫాన్ ప్రభావంతో మంగళవారం భారీవర్షం కురిసింది. గ్రామాల్లోని ప్రధాన రోడ్లు వర్షం నీటితో జలమయమయ్యాయి. చెరువులు, కాలువలు, పంట పొలాలు వర్షం నీటితో నిండాయి. కొత్తూరు, నారాయణపురం గ్రామాల వద్ద ఉన్న మేజర్, మైనర్ శారదా నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. కొత్తూరు వద్ద మేజర్ శారదా నది పాత వంతెనను ఆనుకొని ఉధృతంగా ప్రవహిస్తోంది. మేజర్, మైనర్ శారదా నదుల గట్లు పలుచోట్ల బలహీనంగా ఉండడంతో ఏ సమయంలో ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని గ్రామాల ప్రజలు భయాందోళన చెందుతున్నారు. పశువులను ఆరుబయట కట్టేయడంతో వర్షాలకు తడిసిముద్దవుతున్నాయి. లోవపాలెం, గజిరెడ్డిపాలెం, వాడపాలెం, దిమిలి పరిసర గ్రామాల్లోని పూరిళ్లు, గుడిసెల్లో ఉన్న వారిని గుర్తించి రాంబిల్లి, లాలంకోడూరు, దిమిలి గ్రామాల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు అధికారులు, కూటమి నాయకులు తరలించారు. జడ్‌చింతువా మాజీ సర్పంచ్ ఎరిపల్లి చిట్టిబాబు, తెలుగుయువత మండల అధ్యక్షుడు ఎరిపల్లి అజయ్ లోవపాలెంలోని పూరిళ్లలో ఉన్నవారిని దగ్గరుండి బస్సులో పునరావాస కేంద్రాలకు తరలించారు.

అచ్యుతాపురంలో..

తుఫాన్ కారణంగా పూడిమడక తీరం అల్లకల్లోలంగా ఉంది. అలలు ఉవ్వెత్తున ఎగసిపడుతున్నాయి. మంగళవారం తుఫాన్ జిల్లా ప్రత్యేకాధికారి వినయ్‌చంద్, పరవాడ డీఎస్పీ విష్ణుస్వరూప్, తహసీల్దార్ సత్యనారాయణ, సీఐ నమ్మి గణేశ్, మెరైన్ సీఐ సింహాద్రి నాయుడు పూడిమడక తీరంలో పర్యటించి, ఏర్పాట్లు పరిశీలించారు. అధికారుల నుంచి ఆదేశాలు వచ్చేవరకు చేపల వేటకు వెళ్లవద్దని వారు మత్స్యకారులకు సూచించారు. పూడిమడకలో గల తుఫాన్ రక్షిత భవనాలను పరిశీలించి, పూరిళ్లలో ఉన్న వారిని పునరావాస కేంద్రాలకు తరలించమని అధికారులను ఆదేశించారు. మత్స్యకారులకు బియ్యంతో పాటు నిత్యావసర వస్తువులు సరఫరా చేయాలని మాజీ సర్పంచ్ మేరుగు బాపునాయుడు అధికారులను కోరారు. గొర్లెధర్మవరం పంచాయతీ లంకధర్మవరంలో పంచదార్ల లక్ష్మి పూరిల్లు తాటి కమ్మలు ఎగిరిపోయాయి. దీంతో సర్పంచ్ గొర్లె అశ్విని భర్త నూకరాజు, కూటమి నాయకులు లంక ఆదినారాయణ, పప్ప గణేష్, లంక సత్తిబాబు, పంచాయతీ కార్యదర్శి అరుణ ఆ కుటుంబానికి అంగన్‌వాడీ కేంద్రంలో వసతి కల్పించారు. అంతేకాక బియ్యంతో పాటు నిత్యావసర వస్తువులు, కూరగాయలు అందజేశారు.

ఎలమంచిలిలో..

తుఫాన్ కారణంగా కురిసిన భారీ వర్షాలకు మండలంలో వరహా, మైనర్ శారదా నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. జంపపాలెం ఆనకట్ట వద్ద నీటి ఉధృతి పెరిగింది. దీంతో సమీప గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఎలమంచిలి, అచ్యుతాపురం రహదారుల మధ్య నారాయణపురం వద్ద రోడ్డును ఆనుకుని మైనర్ శారదా నీరు ప్రవహిస్తున్నది. నారాయణపురం గ్రామ సమీపంలో ఉన్న శివాలయం మెట్లపైకి మైనర్ శారదా నీరు చేరింది. ఎలమంచిలి పట్టణంలో మంగళవారం మధ్యాహ్నం నుంచి భారీ ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. పలుచోట్ల రోడ్లపై వర్షం నీరు నిలిచిపోయింది. పలుచోట్ల స్వల్పంగా ఇళ్లు దెబ్బతిన్నప్పటికీ ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదు. పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీ, సీపీ పేట, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పునరావాస కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. ఎన్టీఆర్ కాలనీలో ఇళ్ల దెబ్బతినే అవకాశం ఉన్న 32 మందిని ప్రభుత్వ పాఠశాలలోని పునరావాస కేంద్రానికి తరలించారు. వారందరికీ భోజన సదుపాయాలు కల్పించారు. అదేవిధంగా యర్రవరం, ఏఎస్ఆర్ కాలనీల్లో లోతట్టు ప్రాంతాల్లో ఉన్న వారందరిని అధికారులు అప్రమత్తం చేశారు. ఎన్టీఆర్ కాలనీలో ఇంటి శ్లాబు పెచ్చులూడిన ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదు. రాజీవ్ గాంధీ క్రీడామైదానం చెరువును తలపించేలా తయారైంది. పలు చోట్ల విరిగిన చెట్ల, కొబ్బరి కొమ్మలను మునిసిపల్ సిబ్బంది త్వరితగతిని తొలగించారు. పట్టణంలోని యర్రవరం, ఎన్టీఆర్ కాలనీ ప్రాంతాల్లో మంగళవారం రాష్ట్ర రహదారుల కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు, టీడీపీ నేతలతో కలిసి పర్యటించారు. తుఫాన్ ప్రభావిత బాధితులను పరామర్శించారు. పునరావాస కేంద్రాల్లో బాధితులకు అన్ని సదుపాయాలు కల్పించాలని కమిషనర్ ప్రసాదరాజును కోరారు. అదేవిధంగా చైర్‌పర్సన్ రమాకుమారి ఎన్టీఆర్ కాలనీలోని పునరావాస కేంద్రంలోని ప్రజలను పరామర్శించి ధైర్యం చెప్పారు.

ఎస్.రాయవరంలో..

తుఫాన్ కారణంగా మండలంలో 8 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు తహశీల్దార్ జె.రమేష్‌బాబు తెలిపారు. లోతట్టు ప్రాంతాలైన ఎస్.రాయవరం, వమ్మవరం, రేవుపోలవరం, కొత్తరేవుపోలవరం, బంగారమ్మపాలెం, చినఉప్పలం, వాకపాడ, కాపులవాతాడ గ్రామాల కోసం ఏర్పాటు చేసిన ఈ కేంద్రాల్లో బాధితులకు టిఫిన్, మధ్యాహ్నం భోజన వసతి కల్పించారు. ఈదురు గాలులతో కూడిన వర్షాలకు గెడ్డపాలెం, గోకులపాడు జంక్షన్ మధ్య జాతీయ రహదారిపై చెట్టు కూలింది. సమాచారం అందిన వెంటనే హైవే సిబ్బందితో పాటు సీఐ రామకృష్ణ, ఎస్ విభీషణరావు, పోలీసులు ఆ ప్రదేశాన్ని చేరుకొని చెట్టు తొలగించారు. ఎస్.రాయవరం నుంచి ఉప్పరాపల్లి వెళ్లే రోడ్డులో కూలిన చెట్టును ఎస్ఐ విభీషణరావు దగ్గరుండి తొలగింపజేశారు. తహశీల్దార్‌తో పాటు ఎంపీడీవో మీనాకుమారి, డిప్యూటీ ఎంపీడీవో సత్యనారాయణ తదితర అధికారులు గ్రామాల్లో పర్యటిస్తున్నారు.

వరహానదిని పరిశీలించిన అధికారులు

తుఫాన్ జిల్లా ప్రత్యేకాధికారి వినయ్‌చంద్ ధర్మవరం అగ్రహారం వద్ద వరహానదిని పరిశీలించారు. అనంతరం వరద ప్రవాహం గురించి స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. సోముదేవుపల్లి, వమ్మవరం గ్రామాల్లో గల వరహానది గట్లను నర్సీపట్నం ఆర్డీవో వీవీ రమణ పరిశీలించి, స్థానిక ఇరిగేషన్, రెవెన్యూ అధికారులకు పలు సూచనలు చేశారు.

కోటవురట్లలో..

తుఫాన్ కారణంగా రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా ఈదురుగాలులతో కుండపోత వర్షం కురుస్తోంది. మంగళవారం మండలంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. మండలంలో కైలాసపట్నం, రామచంద్రపురం గ్రామాల వద్ద భారీ వృక్షాలు నేలకూలాయి. తహశీల్దార్ తిరుమలబాబు ఎస్ఐ రవేశ్ వెంటనే స్పందించి చెట్లను తొలగించే ఏర్పాట్లు చేశారు. ఈ వర్షానికి నదులు, వాగులు పొంగి పొర్లుతున్నాయి. పంటలు నీట మునగడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. మిర్చి, వరి, పత్తి పంటలకు తీవ్రనష్టం వాటిల్లింది. పంటచేతికొచ్చే సమయంలో ప్రకృతి వైపరీత్యం కారణంగా నష్టం వాటిల్లడంతో రైతులు లబోదిబోమంటున్నారు. మండలంలో వరహా, సర్పానదులు గట్లుకు ఆనుకొని ప్రవహిస్తున్నాయి. మండలంలో పందూరులో నాలుగు, ముడగలలోవలో రెండు, పాములవాకలో రెండు, కొత్తూరులో రెండు విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. కైలాసపట్నం, రామన్నపాలెంల్లో రెండు ఇళ్లు పడిపోయాయి. ఇళ్లు కూలిపోయిన వారి కుటుంబాలకు టీడీపీ నాయకులు లాలం కాశీనాయుడు, పెట్ల లింగంనాయుడు, జానకి శ్రీనివాసరావు, వేచలపు జనార్దన్ ఆధ్వర్యంలో బాధితులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. గ్రామాల్లో ఎంపీడీవో చంద్రశేఖర్, డిప్యూటీ ఎంపీడీవో కూర్మారావు పర్యటించారు.

పాయకరావుపేటలో..

తుఫాన్ కారణంగా పట్టణంలోని పాండురంగ స్వామి కల్యాణ మండపంలో చాకలిపేటలోని వారికి ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని మంగళవారం ఆర్డీవో వీవీ రమణ సందర్శించారు. అనంతరం వారికి ఏర్పాటు చేసిన భోజనాలను పరిశీలించారు. తాండవ నది ప్రవాహం పెరిగే అవకాశం ఉన్నందున పరివాహక ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ జయప్రకాశ్, టీడీపీ నేతలు పెదిరెడ్డి చిట్టిబాబు, పెదిరెడ్డి శ్రీను, పల్లా విలియం కేరీ, గొల్లపల్లి నాగు, వేములపూడి అప్పారావు, పెదిరెడ్డి పండు, తదితరులు పాల్గొన్నారు.

పాయకరావుపేట రూరల్‌లో..

తుఫాన్ నేపథ్యంలో మంగళవారం నర్సీపట్నం డీఎస్పీ పి.శ్రీనివాసరావు, సీఐ అప్పన్న తీర ప్రాంత గ్రామాలలో ఎస్‌డీఆర్ఎఫ్, అగ్నిమాపక సిబ్బందితో కలిసి పర్యటించారు. వెంకటనగరం, పాల్మన్‌పేట, రాజవరం, పెంటకోట తదితర గ్రామాలలో తుఫాన్ తీవ్రతను ప్రజలకు తెలియజేసి అప్రమత్తం చేశారు. సత్యవరం వద్ద తాండవ బ్రిడ్జిని పరిశీలించారు. ఆయనతో 30 మంది ఎస్‌డీఆర్ఎఫ్, 25 మంది అగ్నిమాపక సిబ్బంది, టీడీపీ మండల, పట్టణ అధ్యక్షులు చెంచలపు ప్రదీప్, యాళ్ల వరహాలు తదితరులు పాల్గొన్నారు. తహశీల్దారు ఎస్.ఎ మహేశ్వరరావు మండలంలోని 16 పునరావాస కేంద్రాలను సందర్శించి పరిశీలించారు. అవసరమై వారికి భోజనాలు ఏర్పాటు చేయాలని సూచించారు.

మేజర్, మైనర్ శారదా నదులను పరిశీలించిన ఎమ్మెల్యే సుందరపు



నారాయణపురం వద్ద మైనర్ శారదానదిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్

రాంబిల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో ఉధృతంగా ప్రవహిస్తున్న మేజర్, మైనర్ శారదా నదులను ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ మంగళవారం పరిశీలించారు. కొత్తూరు, నారాయణపురం గ్రామాల వద్ద నదుల్లో నీటి ఉధృతి అధికంగా ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పూరిళ్లు, గుడిసెల్లో ఉన్నవారు తుఫాన్ ప్రభావం తగ్గేంతవరకు పునరావాస కేంద్రంలో ఉండాలని సూచించారు. పాడిరైతులు తమ పశువులను సురక్షిత ప్రాంతాల్లో ఉంచుకోవాలన్నారు. ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ ఆదేశాల మేరకు కట్టుబోలు సమీపంలోని బలహీనంగా ఉన్న మైనర్ శారదా నది గట్టును టీడీపీ నాయకుడు వి.దిన్‌బాబు, అధికారులతో కలిసి ఇసుక బస్తాలు వేయించి తాత్కాలిక మరమ్మతులు చేయించారు. రాష్ట్రయాదవ కార్పొరేషన్ డైరెక్టర్ ధూళి రంగనాయకులు పలువురు అధికారులతో కలిసి రాంబిల్లిలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈ శివాజీ, యూనిట్ ఇన్‌చార్జి ప్రకాశ్, నీటి సంఘం అధ్యక్షుడు ఈశ్వరరావు, కట్టుబోలు గ్రామస్థులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ముంపులో మోసయ్యపేట

గృహాల మధ్యలో భారీగా చేరిన నీరు

పాములు రావడంతో భీతిల్లుతున్న గ్రామస్థులు

డ్రైనేజీ వ్యవస్థ లేక నిలిచిన నీరు



మోసయ్యపేటలో నిలిచిన వర్షపు నీరు

అచ్యుతాపురం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎడతెరిపిలేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు మోసయ్యపేట నీటిలో చిక్కుకుంది. ఇళ్ల మధ్య భారీగా నీరు చేరడంతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మోసయ్యపేట ఎగువన కొండపై భారీ వర్షం కురియడంతో నీరు గ్రామంలోకి చేరింది. గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో ఎక్కడ నీరు అక్కడే నిలిచిపోయింది. నీటితో పాటు పాములు కూడా కొట్టుకు వచ్చాయి దీంతో గ్రామస్థులు భీతిల్లుతున్నారు. వరద నీరు నిలిచిపోవడంతో ఇళ్లలోంచి బయటకు రావడానికి అవకాశం లేకుండా పోయింది. కాగా కొండకర్ల జంక్షన్ నుంచి ఎంజేపురం వెళ్లే రోడ్డులో ఎర్రవరం వద్ద గల పిల్లేలమ్మ ఆలయ మలుపులో కల్వర్టు గోడ కూలిపోయింది.

తొలగించని భారీ సెట్టింగ్‌ల కర్రలు



దిమిలి రోడ్డు జంక్షన్ రోడ్డుపై తొలగించకుండా ఉన్న భారీ సెట్టింగ్‌కు చెందిన కర్రలు

ఎలమంచిలి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్‌తో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షాలు కురుస్తున్నా పంచరాత్రుల మహోత్సవాలకు ఏర్పాటు చేసిన భారీ సెట్టింగ్‌ల కర్రలు తొలగించలేదు. దీంతో పట్టణ వాసులు ఆందోళన చెందుతున్నారు. పంచరాత్ర ఉత్సవాల కోసం ప్రధాన రోడ్డుపై పెద్ద సంఖ్యలో కర్రలతో భారీ సెట్టింగ్‌లను ఏర్పాటు చేశారు. నాగుల చవితి రోజు రాత్రితో ఉత్సవాలు ముగిశాయి. సెట్టింగ్‌ల నిర్వాహకులు మాత్రం వాటిని పూర్తిస్థాయిలో తొలగించలేదు. దిమిలి రోడ్డు ప్రధాన రోడ్డుపై ఉన్న సెట్టింగ్‌ల కర్రలు తొలగించకపోవడంతో స్థానికులు ఆందోళనకు గురవుతున్నారు. అదేవిధంగా దిమిలి రోడ్డు జంక్షన్ సమీపంలో ప్రధాన రోడ్డు పక్కన విద్యుత్ స్తంభం వంగిపోయి ప్రమాదకరంగా ఉంది.

అధికార యంత్రాంగం అప్రమత్తం

రోడ్ల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు



గణపర్తి-చూచుకొండ బ్రిడ్జిపై నుంచి శారదానది నీటి ప్రవాహాన్ని పరిశీలించిన ప్రగడ నాగేశ్వరరావు, టీడీపీ నేతలు

మునగపాక, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ముప్పును సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉందని రాష్ట్ర రోడ్లు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు అన్నారు. మండలంలో గణపర్తి, చూచుకొండ గ్రామాల్లో మంగళవారం టీడీపీ బృందం పర్యటించింది. ఈ సందర్భంగా నాగేశ్వరరావు పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట గవర కార్పొరేషన్ డైరెక్టర్ భీమరశెట్టి శ్రీను, టీడీపీ నేతలు కర్రి సాయికృష్ణ,కాండ్రేగుల శంకర్ తదితరులు ఉన్నారు. తహశీల్దార్ పి.సత్యనారాయణ, ఎస్ఐ పి.ప్రసాదరావు, ఎంపీడీవో ఎం.ఉషారాణిలు పర్యటించి వీఆర్వో, కార్యదర్శి, సిబ్బందిలను అప్రమత్తం చేశారు.

రాజయ్యపేట తీరంలో ముందుకొచ్చిన సముద్రం

20 మీటర్ల మేరకు తీరం కోత



రాజయ్యపేటలో కోతకు గురైన తీరం

నక్కపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో రాజయ్యపేట సముద్రతీరంలో అలలు 20 మీటర్లు ముందుకు రావడంతో తీరం కోతకు గురైంది. మంగళవారం తీర గ్రామాల్లో అధికారులు ముందు జాగ్రత్త చర్యగా పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. పూరిళ్లు, పల్లపు ప్రాంతాల్లో ఉంటున్న వారిని తుఫాన్ షెల్టర్లు, పునరావాస కేంద్రాలకు తరలించి భోజన సదుపాయం కల్పించారు. పునరావాస కేంద్రాల్లో చేసిన ఏర్పాట్లను తహశీల్దార్ నరసింహమూర్తి, ఎంపీడీవో చలపతిరావు పరిశీలించారు. అలాగే పెదతీనార్ల, చినతీనార్ల, రాజయ్యపేట, బోయపాడు, దొండాడ, అమలాపురం, డీఎల్ పురం గ్రామాల్లో వారు పర్యటించి బాధితులకు ఎటువంటి లోటు లేకుండా సకాలంలో భోజనం, ఇతర సదుపాయాలను కల్పించారు. నక్కపల్లి కొత్తపేటలో మిద్దె ఇల్లు కూలిపోయింది. సమాచారం అందుకున్న వెంటనే ఎస్ఐ సన్నిబాబు, టీడీపీ నియోజకవర్గ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్ ఆ ఇంటిని పరిశీలించారు. సీహెచ్‌బీ అగ్రహారంలో విద్యుత్ స్తంభం నేలకొరిగింది.

ఘనంగా వెల్చూరు నూకాంబిక ఆలయ వార్షికోత్సవం



నూకాంబిక అమ్మవారికి పూజలు చేస్తున్న దాతలు

రాంబిల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెల్చూరు గ్రామంలో నూకాంబిక అమ్మవారి ఆలయం వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, మహాచండీహోమాన్ని చేశారు. స్థానికులే కాకుండా సమీప గ్రామాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించి, పసుపు, కుంకుమలను సమర్పించారు. మొక్కులను చెల్లించుకున్నారు. మధ్యాహ్నం అమ్మవారి ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన ఏర్పాటు చేశారు. వార్షికోత్సవ ఏర్పాట్లను ఆలయ నిర్మాణ దాతలు సుధీర్‌రాజు,ప్రసాద్‌రాజు పర్యవేక్షించారు. గ్రామ పెద్దలు, ఎలమంచిలి మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ సిరిదెల్ల శ్రీనివాసరావు, ఎంపీటీసీ మాజీ సభ్యులు రేబాక ఆనంద్, అనకాపల్లి నాగరాజు, చంటి, భక్తులు పాల్గొన్నారు.



ఎస్.రాయవరం: ధర్మవరం అగ్రహారం వద్ద వరహా నదిని పరిశీలిస్తున్న జిల్లా ప్రత్యేక అధికారి సీనియర్ ఐఏఎస్ వినయ్‌చంద్



పాయకరావుపేట రూరల్: సత్యవరం తాండవ బ్రిడ్జి వద్ద ఎస్‌డీఆర్ఎఫ్ బృందంతో డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ అప్పన్న



పాయకరావుపేట: పాండురంగస్వామి కల్యాణ మండపంలోని పునరావాస కేంద్రంలో భోజనాలను పరిశీలిస్తున్న ఆర్డీవో వీవీ రమణ



నక్కపల్లి కొత్తపేటలో కూలిన ఇల్లు


చెరువును తలపిస్తున్న తుమ్మపాల మెయిన్ రోడ్డు


పరవాడ మండలం తాడి మూడు మదాల వద్ద నీటిలో చిక్కుకున్న ఆటో


అనకాపల్లిలో శారదా నది ఉధృతిని పరిశీలిస్తున్న డీఎస్పీ శ్రావణి


వెంకుపాలెం- కుంచంగి రోడ్డులో దొంగ గెడ్డను పరిశీలిస్తున్న ఎస్పీ

మొత్త మొంథా నీరే!

▸▸ ఎటు చూసినా ఇదే పరిస్థితి ▸▸ తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు ▸▸ లోతట్టు ప్రాంతాల వాసులను పునరావాస కేంద్రాలకు తరలింపు ▸▸ పలు చోట్ల నేలకొరిగిన చెట్లు
▸▸ చెరువును తలపించిన అనకాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణ ▸▸ పరిస్థితిని పరిశీలించిన ఎస్పీ తుహిన్ సిన్హా
▸▸ శ్రీరామనగర్ కాలనీ హాస్టల్ భవనం దెబ్బతినే పరిస్థితి నెలకొనడంతో 140 మంది విద్యార్థులను వేరొక చోటుకు తరలించిన జడ్సీ చక్రవర్తి


అనకాపల్లి మండలంలో వెదుళ్ళ గెడ్డను అనుకొని ఉన్న వరి పంట నీట మునగడంతో పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్సీ నాగజగదీష్


శంకరంలో నీట మునిగిన పంట పొలాలను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ


అనకాపల్లి మండలం వెంకుపాలెం వద్ద వెదుళ్ళ గెడ్డ ఉధృతంగా ప్రవహిస్తుండడంతో నీట మునిగిన రహదారి

అనకాపల్లి టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ ప్రభావం కారణంగా అనకాపల్లి, కశింకోట, పరవాడ, సబ్బవరం మండలాల్లో సోమవారం రాత్రి నుంచి భారీ వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. జనజీవనం స్తంభించిపోయింది. ఎటు చూసినా నీరే కనిపిస్తోంది. రోడ్లన్నీ బోసిపోయి కనిపించాయి. ప్రధానంగా అనకాపల్లి పట్టణంలోని రహదారులన్నీ జలమయమయ్యాయి. ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణమంతా జలమయమైంది. రహదారుల్లోని పల్లపు ప్రాంతాల్లో వర్షపునీరు నిలిచిపోవడంతో ఆయా మార్గాల్లో రాకపోకలు సాగించే ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. వర్షం పడుతూ.., ఆగుతూ ఉండడంతో ప్రజలు ఇళ్లల్లోంచి బయటకు రావడానికి పెద్దగా ఆసక్తి చూపలేదు. ఆర్టీసీ కాంప్లెక్స్‌ల ప్రయాణికుల సంఖ్య అంతంత మాత్రంగానే ఉంది. చాలా దుకాణాలు తీయడానికి వ్యాపారులు పెద్దగా ఆసక్తి చూపలేదు. ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణ నీటిమయం కావడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. జిల్లా ఎస్పీ తుహిన్‌సిన్హా ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ప్రయాణికుల పరిస్థితులను పరిశీలించారు. జలమయమైన కాంప్లెక్స్ ఆవరణను పరిశీలించి నీరు నిల్వ ఉండకుండా తగు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పట్టణంలోని సబ్బవరం రోడ్డు, నూకాంబిక ఆలయం రోడ్డు, నరసింగరావుపేటలోని ఉదయం కురిసిన వర్షానికి, గాలికి చెట్లు నేలకూలాయి. జీవీఎంసీ జోనల్ కమిషనర్ కె.చక్రవర్తి హుటాహుటిన సిబ్బందిని పంపి ఎక్సకవేటర్ సహకారంతో రోడ్డుపై ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు చేపట్టారు. అలాగే తుఫాన్ కారణంగా కొప్పాక, కొత్తూరు నరసింగరావుపేట సచివాలయాల పరిధిలో కొండ మీద స్లైడింగ్ ఏర్పడింది. విషయం తెలుసుకున్న జడ్సీ ముందుగానే ఏర్పాటు చేసిన క్విక్ యాక్షన్ టీమ్‌లను తన వెంట బెట్టుకొని వెళ్లి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టారు. ఆయన వెంట టీపీవో వరప్రసాద్, ఆర్‌వో రమణ, ఏపీడీ సంతోష్‌కుమార్, సిబ్బంది ఉన్నారు. స్థానిక శ్రీరామనగర్‌కాలనీ వద్ద ఉన్న హాస్టల్ భవనం దెబ్బతినే పరిస్థితి నెలకొనడంతో జోనల్ కమిషనర్ అక్కడకు చేరుకొని హాస్టల్‌లో ఉన్న 140 మంది విద్యార్థులను గాంధీనగరం ఉన్నత పాఠశాలకు తరలించి వసతి కల్పించారు. అనకాపల్లి డిఎస్పీ ఎం.శ్రావణి శారదానది ప్రాంతాన్ని పరిశీలించి నీటి ప్రవాహాన్ని చూసి ప్రజలందరూ అప్రమత్తంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కిందస్థాయి అధికారులకు సూచించారు. అడపాదడపా వర్షం కురవడం వల్ల ప్రజలు కూడా ఇబ్బందులు పడ్డారు. అడపాదడపా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

తుఫాన్ ప్రభావం కారణంగా ఎక్కడైనా ప్రజలు ఇబ్బందులకు గురైతే వారిని సురక్షితంగా తీసుకువచ్చి వసతి కల్పించేందుకు పట్టణంలోని మూడు పునరావాస కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. వీటిని జోనల్ కమిషనర్ కె.చక్రవర్తి, సీఐలు జి.ప్రేమ్‌కుమార్, అశోక్‌కుమార్, ఎం.వెంకటనారాయణలు పరిశీలించారు. అక్కడున్న హైస్కూల్ ఉపాధ్యాయులతో మాట్లాడి 24 గంటలు అధికారులకు అందుబాటులో ఉండేలా సూచనలు చేశారు. ఇదిలావుంటే, ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణ మెరుగుపర్చాలని సీపీఎం నాయకులు ధర్నా నిర్వహించారు. పార్టీ జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు, నాయకులు గంటా శ్రీరామ్, ఆర్.శంకరరావు, వీవీ శ్రీనివాసరావు, అల్లు రాజు, బి.ఉమామహేశ్వరరావు, పి.చలపతి తదితరులు పాల్గొన్నారు.

తుఫాన్ ప్రభావం కారణంగా సహాయక చర్యలు చేపట్టేందుకు అనకాపల్లిలోని ఎస్ఆర్ శంకరన్ భవనంలో ఉన్న ఎన్‌డీఆర్ఎఫ్ బృందాన్ని మంగళవారం జిల్లా ఎస్పీ తుహిన్‌సిన్హా కలిసి పలు సూచనలు చేశారు. జిల్లా పరిధిలోని ఎక్కడైనా అత్యవసర పరిస్థితులు తలెత్తినప్పుడు సిద్ధంగా ఉండాలన్నారు. ఆయన వెంట సీఐలు జి. ప్రేమ్‌కుమార్, ఎం.వెంకటనారాయణ, అశోక్‌కుమార్ తదితరులు ఉన్నారు.

అగ్నిమాపక సిబ్బందికి అధికారులు సూచనలు

తుఫాన్ కారణంగా ఎక్కడ ఏ సమస్య వచ్చినా తక్షణమే పరిష్కరించేందుకు అప్రమత్తంగా ఉండాలని అగ్నిమాపక అధికారులు సిబ్బందికి సూచించారు. మంగళవారం స్థానిక అగ్నిమాపక శాఖ కార్యాలయ ఆవరణలో సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎక్కడైనా చెట్లు పడిపోయి ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడితే వెంటనే ఎలక్ట్రికల్ కట్టర్ల ద్వారా సంఘటనా స్థలానికి చేరుకొని చెట్ల కొమ్మలను తొలగించాలన్నారు.

శంకరంలో నీట మునిగిన వరి పంట

అనకాపల్లి రూరల్ : తుఫాన్ కారణంగా మండలంలోని శంకరం గ్రామంలో సుమారు 50 ఎకరాల వరి పంట నీట మునిగింది. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, మంగళవారం వ్యవసాయాధికారులతో కలిసి పంట సదరు పొలాలను పరిశీలించారు. ఎంత మేర పంట నీట మునిగింది అనే వివరాలతో పాటు రైతులను ఆదుకోవాలని కలెక్టర్ విజయకృష్ణన్‌కు ఫోన్‌లో విజ్ఞప్తి చేశారు. అలాగే పంట నష్టంపై అంచనా వేసి రైతులకు న్యాయం చేయాలని వ్యవసాయాధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న వెంకుపాలెం వెదుళ్లగెడ్డ

కొత్తూరు : అనకాపల్లి మండలం వెంకుపాలెం సమీపంలో ఉన్న వెదుళ్ళ గెడ్డ ఉధృతంగా ప్రవహిస్తుంది. సుమారు ఐదు గ్రామాలను అనుసంధానం చేస్తూ ఉన్న రహదారి పూర్తిగా నీటమునిగింది. దీంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అనకాపల్లి రూరల్ సీఐ అశోక్‌కుమార్, ఎస్ఐ రవికుమార్ సిబ్బందితో ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. వెదుళ్ళగెడ్డ ఉధృతంగా ప్రవహిస్తున్న తరుణంలో ప్రత్యామ్నాయ మార్గమైన వెంకుపాలెం- కుంచంగి గ్రామాల మీదుగా సుందరయ్యపేట, అచ్చియ్యపేట, మొండిపాలెం, సంపతిపురం తదితర గ్రామాల వారు రాకపోకలు సాగించేలా ఏర్పాట్లు చేపట్టారు. వర్షపు నీరు గెడ్డల్లో భారీగా చేరడంతో నిండిపోయి ఆ పరిసరాల్లో పంట పొలాల్లోకి చేరుతోంది. దీంతో వందలాది ఎకరాల్లో వరిపంట నీట మునిగింది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇదిలావుంటే, వెంకుపాలెం శారదానది శివారున ఉన్న వెదుళ్ళగెడ్డ ప్రవాహాన్ని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా పరిశీలించారు. కుంచంగి, వెంకుపాలెం వెళ్లే రహదారిని కూడా పరిశీలించి గ్రామస్థులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. ఆయన వెంట స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ బాలసూర్యారావు, రూరల్ సీఐ జి.అశోక్‌కుమార్, ఎస్ఐ జి.రవికుమార్ ఉన్నారు. ఇదిలావుంటే, వెంకుపాలెంలో నీటమునిగిన వరి పొలాలను మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగజగదీశ్వరరావు పరిశీలించారు. సుమారు 250 ఎకరాల్లో వరి పంట నీట మునిగినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, రైతులు పాల్గొన్నారు.

నీట మునిగిన పంట పొలాలు

తుమ్మపాల : ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు అనకాపల్లి మండలంలోని ఎటుచూసినా నీరే కనిపిస్తోంది. తుమ్మపాల మెయిన్ రోడ్డుపై చెరువును తలపిస్తుంది. ప్రధానంగా తుమ్మపాల, మార్టూరు, మాకవరం, వెంకుపాలెం తదితర గ్రామాల్లోని పొలాల్లోకి భారీగా నీరు చేరడంతో పంటలన్నీ నీట మునిగాయి. కూండ్రం శివారు వెంకుపాలెం దగ్గర వెదురుగెడ్డకు గండి పడటంతో గెడ్డ నీరు పూర్తిగా పొలాల్లోకి ప్రవహిస్తుంది. దీంతో చుట్టుపక్కల పొలాలన్నీ జలమయమయ్యాయి. గ్రామాల్లో ప్రజలు ఇళ్లలోంచి బయటకు వచ్చే పరిస్థితి కానరాలేదు. పంటనష్టం వాటిల్లిన గ్రామాల్లో పలువురు అధికారులు పర్యటించారు. పంటనష్టాన్ని అంచనా వేస్తామని మండల వ్యవసాయాధికారి పి.రంగాచారి తెలిపారు. ఇదిలావుంటే, పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం నాయకులు జి.కోటేశ్వరరావు, గంటా శ్రీరామ్, వీవీ శ్రీనివాసరావు, అల్లు రాజు, బి.ఉమామహేశ్వరరావు, సిరసపల్లి అప్పలరాజు, చలపతి తదితరులు కోరారు. పలు గ్రామాల్లో మంగళవారం పర్యటించి పంట పొలాలను పరిశీలించారు.

నరసాపురం డ్యామ్ గేట్లు ఎత్తివేత

కశింకోట : తుఫాన్ కారణంగా శారదా నదిలోకి వరద నీరు చేరి ఉధృతంగా ప్రవహిస్తుండడంతో మంగళవారం నరసాపురం డ్యామ్ గేట్లు ఎత్తివేశారు. దీనివల్ల ఎగువ ప్రాంతం నుంచి వచ్చిన నీటి ప్రవాహం సక్రమంగా జరిగే అవకాశముందని డ్యామ్ కమిటీ చైర్మన్ గొంతిన చిరంజీవి తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు గొంతిన శ్రీనివాసరావు, జనసేన అధ్యక్షుడు మారిశెట్టి ఫణికుమార్, నానాజీ, అందె చిరంజీవి, ప్రకాష్, నూకునాయుడు, రమణ తదితరులు పాల్గొన్నారు. ఇదిలావుంటే, శారదా నది ఉధృతంగా ప్రవహిస్తుండడంతో పరీవాహక ప్రాంత సమీపాల్లో నివాసం ఉన్న వారిని పునరావాస కేంద్రాలకు తరలించామని మండల ప్రత్యేకాధికారిణి వి.లక్ష్మీసుభాషిణి, తహశీల్దార్ తిరుమలరావు తెలిపారు. వై.తుని పునరావాస కేంద్రానికి 13 మందిని, జోగారావుపేట పునరావాస కేంద్రానికి ఆరుగురిని తరలించి వసతి సౌకర్యం కల్పించామన్నారు.

పరవాడ మండలంలో విస్తారంగా వర్షాలు

పరవాడ : తుఫాన్ కారణంగా మండల వ్యాప్తంగా సోమవారం అర్ధరాత్రి మంగళవారం మధ్యాహ్నం వరకు విస్తారంగా వర్షాలు కురిశాయి. వర్షంతో పాటు ఈదురుగాలులు వీయడంతో పలుచోట్ల హోర్డింగ్‌లు నేలకొరిగాయి. నాయుడుపాలెం పంచాయతీ పరిధిలో రెండు విద్యుత్ స్తంభాలు కూలాయి. ఇదే పంచాయతీ పరిధిలోని వెంకటపతిపాలెం సమీపంలో భారీ వృక్షం రహదారిపై కూలిపోయింది. దీంతో అటుగా రాకపోకలు సాగించే వారికి ఇబ్బందులు తలెత్తకుండా తహశీల్దార్ నాగరాజు పర్యవేక్షణలో యుద్ధ ప్రాతిపదికన తొలగించారు. ఫార్మాసిటీకి ఆనుకొని ఉన్న తాడి గ్రామం మూడు మదాల వద్ద ప్రధాన రహదారిపై వర్షపునీరు పెద్ద ఎత్తున నీరు నిల్వ ఉండిపోవడంతో అటుగా రాకపోకలు సాగించే వారు అవస్థలు పడాల్సి వచ్చింది. ఈ క్రమంలో సాలాపువానిపాలెం నుంచి ప్రయాణికులతో వస్తున్న ఆటో వర్షపునీటిలో చిక్కుకుంది. స్థానికుల సహాయంతో ఆటోను బయటకు తీసుకువచ్చారు. పరవాడలోని మంగళవారపు సంత వెలవెలబోయింది. ఇదిలావుంటే, ముత్యాలమ్మపాలెం తీరంలో ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు పర్యటించారు. ప్రజలంతా ప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని సందర్శించారు. పునరావాస కేంద్రంలో ఉన్న వారందరికీ ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి భోజనాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట సర్పంచ్ చింతకాయల సుజాత, మాజీ ఎంపీపీలు పైలా జగన్నాథరావు, మాసవరపు అప్పలనాయుడు, కూటమి నాయకులు పాల్గొన్నారు. అలాగే, పశు సంవర్ధక శాఖ పరవాడ డివిజన్ ఏడీ కీర్తి రామకృష్ణ వాడచీపురుపల్లి, రావాడ పంచాయతీల పరిధిలో గల గ్రామాల్లో తన సిబ్బందితో కలిసి విస్తృతంగా పర్యటించారు. తుఫాన్ బారిన పడకుండా పాడి రైతులు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. పశువైద్యాధికారి సురేష్‌కుమార్, సహాయకులు పాల్గొన్నారు.

తాడి వెళ్లే రహదారి జలమయం

లంకెలపాలెం, అక్టోబరు28 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ కారణంగా రెండో రోజు మంగళవారం లంకెలపాలెం, పరిసర ప్రాంత గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. సాలాపువానిపాలెం, పెదముషిడివాడ, కస్నూరు, మంత్రిపాలెం, మడకపాలెం, గండివానిపాలెం, పచ్చిగోరువానిపాలెం, విజయరాంపురం పరిసర ప్రాంత గ్రామాల్లో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. ముఖ్యంగా జాతీయ రహదారి మూడు మదాల మీదుగా తాడి వెళ్లే రహదారి పూర్తిగా నీటి మునిగింది. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి. నీటిలో ఓ ఆటో చిక్కుకు పోవడంతో స్థానికులు బయటకు లాగారు. లంకెలపాలెం, ఫార్మాసిటీ రహదారి ఏలేరు కాలువ బ్రిడ్జి వద్ద రహదారిపై నుంచి నీరు పారింది. దేశపాత్రునిపాలెం, జాజులవానిపాలెం, సాయినగర్ కాలనీ, పరిసర ప్రాంతాల్లో మంగళవారం కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ పర్యటించారు. ప్రధాన గెడ్డలతో పాటు డ్రైనేజీలను పరిశీలించి, ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆయన వెంట నాయకులు ఉన్నారు.

గుల్లేపల్లి రహదారిలో రాకపోకలు బంద్

సబ్బవరం : తుఫాన్ కారణంగా కురుస్తున్న వర్షాలకు సబ్బవరం-గుల్లేపల్లి రహదారిలోని ఆదిరెడ్డిపాలెం వద్ద గెడ్డ పొంగి ప్రవహిస్తోంది. దీంతో అధికారులు ప్రజల రాకపోకలను పినగాడి మీదుగా మళ్లించారు. మండలంలో 33 సాగునీటి చెరువులు హై రిస్క్ జోన్‌లో ఉన్నాయన్న ప్రభుత్వ సమాచారం మేరకు ప్రతి చెరువు పర్యవేక్షణకు ఒక బృందం ఏర్పాటు చేసి నిఘా ఉంచామని తహశీల్దార్ చిన్నికృష్ణ తెలిపారు. పలు పూరిళ్లు, కచ్చా ఇళ్లలో నివసిస్తున్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించే ఏర్పాటు చేశామన్నారు. మలునాయుడుపాలెం, సబ్బవరంలలో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఇదిలావుంటే, తుఫాన్ పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలని పంచకర్ల రమేశ్‌బాబు సూచించారు. ఇక్కడి మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతానికి తరలించాలన్నారు. అంతా సమన్వయంతో పనిచేసి ప్రజల ప్రాణాలు, ఆస్తికి నష్టం వాటిల్లకుండా చూడాలని కోరారు. ప్రత్యేకాధికారిణి రమామణి, తహశీల్దార్ చిన్నికృష్ణ, ఎంపీడీవో పద్మజ మాట్లాడుతూ పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బోకం సూర్యకుమారి, సీఐ రామచంద్రరావు తదితర అధికారులు పాల్గొన్నారు.


వాడచీపురుపల్లి- ముత్యాలమ్మపాలెం ప్రధాన మార్గం వెంకటపతిపాలెం సమీపంలో రహదారిపై కూలిన చెట్టు


పరవాడ మండలం ముత్యాలమ్మపాలెం తీరంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు


అనకాపల్లిలోని జీవీఎంసీ హైస్కూల్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న జోనల్ కమిషనర్ చక్రవర్తి, తదితర అధికారులు


కశింకోట మండలం వై.తుని పునరావాస కేంద్రంలో గ్రామస్థులకు ఆహారం ఏర్పాటు చేసిన అధికారులు

భక్తిశ్రద్ధలతో భోగలింగేశ్వరునికి ఊంజల్ సేవ

అనకాపల్లి టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : గవరపాలెం భోగలింగేశ్వరుని ఆలయంలో సోమవారం రాత్రి సర్వకామదాంబ సమేత భోగలింగేశ్వర స్వామి ఊంజల్ సేవను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బుద్ద రమణాజీ దంపతులు, కొణతాల ప్రవీణ్ దంపతులు,


ఊంజల్‌సేవ నిర్వహిస్తున్న భక్తులు

కొణతాల అయ్యప్ప జగన్నాథరావు దంపతులు ప్రత్యేక పూజలు చేసి ఊంజల్ సేవ జరిపారు. ఈ సందర్భంగా సిరి స్పందన నృత్యాలయం ఆధ్వర్యంలో చిన్నారుల భరతనాట్యం ఆకట్టుకుంది. ఆలయ మాజీ చైర్మన్ కాండ్రేగుల సత్యనారాయణతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

క్రీడా ప్రోత్సాహకాలకు దరఖాస్తుల ఆహ్వానం

అనకాపల్లి టౌన్, అక్టోబరు 28 (ఆంధ్ర జ్యోతి) : జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించిన రాష్ట్ర క్రీడా పతకాల విజేతలకు నగదు ప్రోత్సాహకాలు అందించనున్నట్టు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి పూజారి శైలజ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు గాను అర్హులైన క్రీడాకారులు నవంబరు నాల్గో తేదీ రాత్రి లోపు ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకోవాలని ఆమె కోరారు. మరిన్ని వివరాలకు 63008 82349 నంబరులో సంప్రదించాల్సిందిగా సూచించారు.

సీఎం సహాయ నిధి మంజూరు పత్రాల పంపిణీ

సబ్బవరం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : ప్రజల ఆరోగ్య పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందని టీడీపీ పెందుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి, ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ గండి బాబ్జీ అన్నారు. మండలంలోని మొగలిపురంలో అనారోగ్యానికి గురైన పలువురికి మంగళవారం ముఖ్యమంత్రి సహాయ నిధి మంజూరు పత్రాలను అందజేసి మాట్లాడారు. సంక్షేమ పథకాలను అర్హులంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో 88వ వార్డు కార్పొరేటర్ మొల్లి ముత్యాలు, ఈపు అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.


ముఖ్యమంత్రి సహాయ నిధి మంజూరు పత్రాలు అందజేస్తున్న గండి బాబ్జీ

31 మద్యం బాటిళ్లతో ఇద్దరి అరెస్టు

కొత్తూరు, అక్టోబర్ 28 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలం వెంకుపాలెం, తగరంపూడి గ్రామాల్లో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరిని అరెస్టు చేశామని ఎక్సైజ్ సీఐ వై.లక్ష్మునాయుడు తెలిపారు. ఈ మేరకు వెంకుపాలెం గ్రామ శివారున మద్యం విక్రయాలు చేస్తున్న ఎర్ర వెంకట జగ్గారావును మంగళవారం అదుపులోకి తీసుకోగా, ఇరవై మద్యం బాటిళ్లు లభ్యమయ్యాయన్నారు. అలాగే, తగరంపూడి గ్రామ శివారున అక్రమంగా మద్యం విక్రయాలు చేస్తున్నారన్న సమాచారం మేరకు సిబ్బందితో దాడి చేశామన్నారు. కారుకొండ లక్ష్మిని అదుపులోకి తీసుకోగా పదకొండు మద్యం బాటిళ్లు పట్టుబడినట్టు చెప్పారు. కేసు నమోదు చేసిఅరెస్టు చేశామన్నారు.

జిల్లాస్థాయి యోగా పోటీల్లో తుమ్మపాల వాసుల ప్రతిభ

తుమ్మపాల, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లా స్థాయి యోగా చాంపియన్‌షిప్ పోటీల్లో తుమ్మపాల శ్రీకృష్ణ యోగా సెంటర్‌కు చెందినవారు అద్భుత ప్రతిభ చూపారు. విశాఖపట్నంలో ఆదివారం జరిగిన ఈ పోటీల్లో 60 ఏళ్ల విభాగంలో బి.నరసింగరావు ప్రథమ బహుమతిని గెలుపొందారు. దీంతో అతనిని డిసెంబరు 27 నుంచి 29వ తేదీ వరకు బాపట్లలో జరిగే నేషనల్ యోగాసన పోటీలకు ఎంపిక చేశారు. అలాగే ఎనిమిది నుంచి పద్నాలుగేళ్ల విభాగంలో బి.దేవాన్స్ నాయుడు ద్వితీయ బహుమతి, బి.జయశ్రీ తృతీయ బహుమతి, 18 నుంచి 24 సంవత్సరాల విభాగంలో తేజస్విని ఆరో బహుమతిని సాధించారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణ యోగా సెంటర్ విద్యార్థులను మాజీ సర్పంచ్ కర్రి బాబి, ఎస్‌వీడీఎస్ కార్యదర్శి జోగినాయుడు, స్థానిక నాయకుడు ఎం.అజయ్, ఎన్.గణేష్, ఎన్.బోసుబాబు, పి.గణపతిరావు తదితరులు అభినందించారు.


అరవై ఏళ్ల విభాగంలో పతకాన్ని అందుకుంటున్న నరసింగరావు

గంజాయి కేసులో పరారీలో ఉన్న వ్యక్తి అరెస్టు

అనకాపల్లి టౌన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : గంజాయి రవాణా కేసులో నిందితుడ్ని అరెస్టు చేసినట్టు పట్టణ ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపారు. ఈ నెల 25వ తేదీన ఎన్టీఆర్ మార్కెట్ యార్డు ప్రాంతంలో పది కిలోల గంజాయితో చెన్నైకు చెందిన ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశామన్నారు. ఆ కేసులో పరారీలో ఉన్న చీడికాడ మండలానికి చెందిన చిన్నం నాయుడును మంగళవారం సాయంత్రం అనకాపల్లి గూడ్స్‌షెడ్డు జంక్షన్ వద్ద పట్టుకుని అరెస్టు చేసినట్టు ఎస్ఐ చెప్పారు.

వరిలో సస్య రక్షణకు చర్యలు తీసుకోవాలి

» ఏడీఆర్ డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి



చౌడుపల్లిలో పొలాలను పరిశీలిస్తున్న ఏడీఆర్ అప్పలస్వామి, అధికారులు

చింతపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): వర్షాల నుంచి వరి పంటను కాపాడుకునేందుకు రైతులు ప్రత్యేక సస్యరక్షణ చర్యలు చేపట్టాలని స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి అన్నారు. మంగళవారం శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు చింతపల్లి, జీకేవీధి మండలాల్లో చౌడుపల్లి, గాడిదలమెట్ట, చెరువువీధి, రింతాడ, అసరాడ, ఏబులం గ్రామాల్లో పొలాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈసందర్భంగా రైతులతో ఏడీఆర్ మాట్లాడుతూ తుఫాను ప్రభావం వల్ల భారీ వర్షాలు కురుస్తున్నందున వరి పొలాల్లో నీరు నిలువలేకుండా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. పొలంలో నీరు అధికంగా ఉంటే పెద్ద కాలువాలు ఏర్పాటు చేయాలన్నారు. నీరు ఉంటే గింజలు రంగు మారడం, మాగుడు తెగులు, మానిపండు తెగులు నివారణకు ఎకరాకు 200మిల్లీ లీటర్లు ప్రోపికోనజోల్ పిచికారీ చేయాలన్నారు. పడిపోయిన కంకిలో మెలకలు కనబడితే 5శాతం(50గ్రాములు స్పటిక ఉప్పు లీటరు నీటిలో కలుపుకోవాలి) ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేయాలన్నారు. పసుపు, అల్లం, చామదుంప పొలాల నుంచి నీటిని తొలగించాలని కోరారు. పశువులను సురక్షిత ప్రాంతాల్లో ఆశ్రయం కల్పించి, పొడి మేత, సరిపడే తాగు నీరు పెట్టాలన్నారు. తేనెటీగ పెట్టెలను ఎత్తైన పొడి ప్రదేశాలకు తరలించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ టి. తిరుమలరావు, వ్యవసాయ అధికారులు టి. మధుసూదనరావు, డి. గిరిబాబు, వీఏఏ, వీహెచ్ఏలు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు సీతగుంట విద్యార్థి

పెదబయలు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీతగుంట జడ్పీ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థి పాంగి రాముడు రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్టు హెచ్ఎం చిన్నయ్య తెలిపారు. ఇటీవల అచ్యుతాపురం మండలం మల్లిపాకలలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచాడన్నారు. రాజమండ్రిలో జరిగే రాష్ట్ర స్థాయి అండర్-17 పోటీలకు ఆడబోతున్నాట్టు పేర్కొన్నారు. రాముడిని, పాఠశాల పీడీ కేవీ పద్మావతిని ఉపాధ్యాయులు అభినందించారు.



వాలీబాల్ పోటీలకు ఎంపికైన రాముడు

జీజీహెచ్‌కు 15 యూనిట్ల రక్తం

పాడేరురూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ నేపథ్యంలోవిశాఖపట్నం రెడ్ క్రాస్ సొసైటీ బ్రాంచి నుంచి 15 యూనిట్‌ల బి-పాజిటివ్ 5, ఓ-పాజిటివ్ 10 యూనిట్‌ల బ్లడ్‌ను స్థానిక జీజీహెచ్ బ్లడ్ బ్యాంక్‌కు మంగళవారం అందించినట్టు రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా కార్యదర్శి జి.గౌరీశంకరరావు తెలిపారు. అత్యవసరంగా బ్లడ్ అవసరమున్న వారు ఆసుపత్రి బ్లడ్ బ్యాంక్‌లో సంప్రదించాలన్నారు.




రక్త నిల్వలను అందిస్తున్న రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధి గౌరీశంకరరావు

నిలిచిన విద్యుత్ సరఫరా

చింతపల్లి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను ప్రభావం వల్ల గూడెంకొత్తవీధి, చింతపల్లి మండలాలకు 13గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. మంగళవారం ఈదురు గాలుల బీభత్సానికి నర్సీపట్నం-కొరుప్రోలు, డౌనూరు-చింతపల్లి 33కేవీ విద్యుత్ తీగలపై చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. దీంతో ఉదయం ఏడు గంటల నుంచి గిరిజన గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో గ్రామాల్లో తాగు నీరు కోసం తీవ్ర ఇబ్బంది పడాల్సివచ్చింది. కాగా స్థానిక ఈపీడీసీఎల్ ఏఈఈ వనుము ప్రభాకరరావు, విద్యుత్‌శాఖ సిబ్బంది వర్షంలో సాంకేతిక సమస్యను గుర్తించే పనుల్లో నిమగ్నమయ్యారు. రాత్రి 8:30గంటలకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

కలెక్టర్ పేరిట సోషల్ మీడియాలో ఫేక్ అకౌంట్

పాడేరు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్లు ఏకంగా జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ పేరిట ఒక ఫేక్ సోషల్ మీడియా అకౌంట్‌ను సృష్టించడం ప్రస్తుతం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. వాస్తవానికి ఇదే విధంగా గత ఏడాదిలోనూ జరిగింది. మళ్లీ ఇటీవల కలెక్టర్ దినేశ్‌కుమార్ పేరిట మెసెంజర్‌లో నకిలీ అకౌంట్‌ను సృష్టించి, కలెక్టర్‌కు సంబంధమున్న కాంటాక్ట్‌లో ఉన్న వారికి డబ్బులు కావాలని మెసేజ్‌లు పెట్టడం అసలు విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో అప్రమత్తమైన కలెక్టర్, దానిపై ఎవరూ స్పందించవద్దని ఓ ప్రకటనలో సూచించారు.



కలెక్టర్ దినేశ్‌కుమార్ పేరిట సృష్టించిన ఫేక్ అకౌంట్

భీంపోలు-గుమ్మకోట మార్గంలో రాకపోకలు బంద్



లువ్వా కాజ్‌వేను మూసివేసిన అధికారులు

అనంతగిరి, అక్టోబరు 28: మండలంలోని భీంపోల్-గుమ్మకోట రోడ్డులోని భీంపోలు సమీపంలో లువ్వా గెడ్డ ఉధృతంగా పారుతుంది. తహసీల్దార్ వీరభద్రచారి, ఎంపీడీవో ప్రభాకర్, ఎస్ఐ డీ.శ్రీనివాసరావు ఆదేశాలమేరకు.. కాజ్‌వేను మూసివేశారు. గత రెండేళ్ల క్రితం ఇదే కాజ్‌వేపై నుంచి ముగ్గురు గిరిజనులు కొట్టుకునిపోయి, మృత్యువాతపడిన నేపథ్యంలోని అధికారులు మరింత అప్రమత్తయ్యారు.

వ్యాన్ బోల్తా: ఇద్దరికి గాయాలు

ముంచంగిపుట్టు, అక్టోబరు 28, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం నుంచి పెదబయలు వెళ్లే మార్గం మధ్యలోని కిలగాడ మలుపు వద్ద మంగళవారం ధాన్యం బస్తాల లోడుతో వెళ్తుతున్న వ్యాన్ అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఇద్దరు గాయాలయ్యాయి. వీరినిస్థానికులు కిలగాడ పీహెచ్‌సీకి తరలించగా వైద్యాధికారిణి శిరీష వైద్య సేవలందించారు. ఘాటీ దిగుతున్న సమయంలో మలుపు వద్ద విద్యుత్ స్తంభాన్ని వ్యాన్ బలంగా ఢీ కొట్టి పల్టీకొట్టింది. దీంతో విద్యుత్ స్తంభం విరిగి పడింది. విద్యుత్ వైర్లు తెగిపోయాయి. ఆ సమయంలో విద్యుత్ సరఫరా లేకపోవడం వలన పెను ప్రమాదం తప్పింది. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి రహదారికి ఇరువైపులా రక్షణ గోడలు నిర్మాణం చేపట్టాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.



డుంబ్రిగుడ మండలం ఇంటిపాక వంతెనను పరిశీలిస్తున్న కలెక్టర్ దినేశ్‌కుమార్, అధికారులు



గోస్తనీ ప్రవాహంతో బొర్రా హోటల్స్ వద్ద కోతకు గురవుతున్న దృశ్యం

లోతట్టు ప్రాంత ప్రజల రక్షణకు చర్యలు

» కలెక్టర్ దినేశ్‌కుమార్

» తుఫాన్ ప్రభావిత గ్రామాల్లో పర్యటన

హుకుంపేట అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి); తుఫాన్ నేపథ్యంలో ప్రజలంతా సురక్షిత ప్రాంతాల్లో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ దినేశ్ కుమార్ ఆదేశించారు. మంగళవారం మండలంలోని గూడ పంచాయతీ మఱ్రిపుట్టు , చిడిపుట్టు వద్ద, రంగశీల ఒంటిపాక వంతెనలు, వాగులను పరిశీలించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుఫాన్ ప్రభావం తీవ్రంగా ఉన్నందున అధికారులు సచివాలయ సిబ్బంది ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. మట్టి గోడలతో నిర్మాణాలు కలిగిన కుటుంబాలను అవగాహన కల్పించి వారిని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీలు, సచివాలయాలు, ఇతర సురక్షిత ప్రాంతాల వద్దకు సూచించారు, గడ్డలు వంతెనలు వాగులు ఉన్న గ్రామాల ప్రజలకు చెందిన ప్రజలను రాకపోకలు సాగించకుండా పోలీసులు, రెవెన్యూశాఖ సిబ్బంది గస్తీ ఏర్పాటు చేయాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా చర్యలు తప్పదని కలెక్టర్ హెచ్చరించారు. అవసరమైన చోట్ల వంతెన నిర్మాణాలకు అంచనాలు రూపొందించి ఇవ్వాలని ఇంజనీరింగ్ అధికారి సంజీవరావుకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రమాదేవి, తహశీల్దార్ శ్రీనివాస్, డిప్యూటీ తహశీల్దార్ మోహన్‌రావు, స్థానిక ఎస్ఐ సూర్యనారాయణ, పంచాయతీ సెక్రటరీలు అనుష, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. అసంపూర్తి భవనంలో ఉన్న ప్రతి కుటుంబాలను పునరావాస కేంద్రాలకుతరలించాలని కలెక్టర్ ఎఎస్ దినేశ్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం గడికించు మండల సచివాలయం పరిధి గడ్డిమరి గ్రామాన్ని సందర్శించారు. సచివాలయంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో ఉన్న కుటుంబలతో ఆయన మాట్లాడారు. తుఫాన్ తగ్గే వరకు వీరికి భోజనాలు, వసతి ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ఈకార్యక్రమంలో సచివాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

వంతెనలు, వాగులు దాటవద్దు

డుంబ్రిగుడ: వాగులు పొంగి ప్రవహిస్తున్న నేపథ్యంలో వంతెనలపైనుంచి రాకపోకలు సాగించవద్దని కలెక్టర్ దినేశ్‌కుమార్ ప్రజలకు సూచించారు. మంగళవారం మండలంలోని ఇంటిపాక వంతెనను పరిశీలించిన ఆయన మాట్లాడారు. అలాగే, కించుమండలో జరిగే బుధవారం జరిగే సంతకు చుట్టు ప్రక్కల ప్రజలు రాకుండా ఉండాలన్నారు. సంత నిర్వహించకుండా మండల అధికారులను ఆయన ఆదేశించారు. గ్రామాల్లో ఎటువంటి సంఘటనలు చోటు చేసుకునా తక్షణమే మండల స్థాయి అధికారులకు సమాచారం అందించాలన్నారు. తుఫాన్ తగ్గేంత వరకు గృహాల్లోనే ఉండాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రేమ్‌సాగర్, తహసీల్దార్ త్రివేణి, గృహనిర్మాణ శాఖ, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

పునరావాస కేంద్రాన్ని సందర్శించిన ఏపీసీ

అనంతగిరి: మండలంలోని బొర్రా పునరావస కేంద్రాన్ని ఏపీసీ, మండల ప్రత్యేకాధికారి స్వామినాయుడు మంగళవారం సందర్శించారు. వంట్లమామిడి, చప్పాడి గ్రామస్థులతో కలిసి మాట్లాడారు. అనంతరం వంట్లమామిడి గ్రామానికి వెళ్లి, పరిస్థితి పరిశీలించారు. లువ్వా కాజ్‌వేపై నుంచి రాకపోలను నిలిపివేయాలని, అలాగే మర్రగుడ-లక్ష్మీపురం మార్గమధ్యలోగల గెడ్డను రాకపోకలు నిలిపివేయాలని ఆదేశించారు. ఏటీడబ్ల్యూవో కూడ వెంకటరమణ, ఎంఈవోలు కిల్లో బాలజీ, బీబీ.నగేశ్వరరావు, తదితరులు ఉన్నారు.

తోకరాయి, చత్రాపల్లి వాసుల తరలింపు

సీలేరు: జీకేవీధి మండలంలోని ధారకొండ, గాలికొండ పంచాయతీలకు చెందిన తోకరాయి చత్రాపల్లి గ్రామాల ప్రజులను సీలేరు ఎస్ఐ ఆధ్వర్యంలో సురక్షిత ప్రాంతాలకు మంగళవారం తరలించారు. గత ఏడాది సెప్టెంబరు 8 న ఈ ప్రాంతంలో సంభవించిన భారీ తుఫాన్‌కు తోకరాయి, చత్రాపల్లి గ్రామ సమీపంలోని కొండచరియలు జారి పడటంతో పెను నష్టం సంభవించింది. చత్రాపల్లిలో ఇద్దరు మృత్యువాత పడ్డారు. పలువురు తీవ్రంగా గాయపడ్డారు.గత సంఘటనలను దృష్టిలో పెట్టుకుని ముందస్తు చర్యల్లో భాగం గా ఆ గ్రామ ప్రజలను ధారకొండ ఆశ్రమ పాఠశాలకు, చత్రాపల్లి వాసులను సప్పర్ల ఆశ్రమ పాఠశాలకు ఎస్ఐ యాసిన్ తమ సిబ్బందితో కలసి వాహనాల్లో తరలించారు.

బలిమెల జలాశయం దిగువన ఉన్నగ్రామాల ప్రజలు అప్రమత్తం

సీలేరు: బలిమెల డ్యామ్ దిగువన ఉన్న గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలంటూ చిత్రకొండ డ్యామ్ డివిజన్ అధికారులు మంగళవారం విస్తృతంగా ప్రచారం చేశారు. తుఫాన్ నేపత్యంలో జోలాపుట్ నుంచి భారీగా వరదనీరు బలిమెలలో వచ్చి చేరుతుండటంతోపాటు బలిమెల ఒడిశా అధికారులు అప్రమత్తమయ్యాయి. బలిమెల దిగువన ఉన్న గుంటవాడ పంచాయతీలోని పలు గ్రామాలు, సీలేరులో మంగళవారం ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విస్తృతంగా ప్రచారం చేశారు. సీలేరులో గుంటవాడ జలాశయం, రెగ్యులేటర్ డ్యామ్, జలవిద్యుత్ కేంద్రం వద్ద సిబ్బందిని అప్రమత్తం చేసినట్టు ఏపీ జెన్‌కో సీలేరు క్యాంప్ ఏఈఈ సీహెచ్ సురేశ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో మెయిన్ డ్యామ్, రెగ్యులేటర్ డ్యామ్‌ల వద్ద జనరేటర్లు, డీజిల్, సైరన్‌లను సిబ్బందిని సిద్ధంగా ఉంచామన్నారు. అలాగే జలవిద్యుత్ కేంద్రం వద్ద వరదనీరు వచ్చే ప్రమాదం ఉండటంతోలోనికి నీరు చేరకుండా మోటార్లను ఏర్పాటు చేసినట్టు జెన్‌కో ఏఈఈ సురేశ్ తెలిపారు.

నందిగరువులో కూలిన భారీ వృక్షం

పాడేరురూరల్: ఈదురు గాలులకు నందిగరువు గ్రామ మధ్యలో ఉన్న చింత చెట్టు మంగళవారం నేలకొరిగింది. పరిసరాల్లో పెను ప్రమాదం తప్పడంతో గ్రామస్థులు ఊపిరి పీల్చుకున్నారు. వంట్లమామిడి పంచాయతీ నందిగరువు గ్రామంలో చింతచెట్టు కొమ్మలకు గాలులకు విరిగి పడ్డాయి.

పాడేరురూరల్ తుఫాన్ నేపథ్యంలో పాడేరు - హుకుంపేట మండల సరిహద్దులో దిగువమోదాపుట్టు, అడ్డుమండ గ్రామాల మధ్యగల మత్స్యగెడ్డపై ఉన్న కాజ్‌వేను పాడేరు ఎస్ఐ ఎల్.సురేష్ తమ సిబ్బందితో కలిసి మంగళవారం సందర్శించారు. గ్రామ ప్రజల సహకారంతో కాజ్‌వేపై నుంచి రాకపోకలను నిషేధిస్తూ అడ్డంగా కంచెను వేశారు. మారుమూల గ్రామాల్లో ప్రజలు అత్యఅవసర సమయంలో తప్ప ఎవరూ బయట తిరగవద్దని సూచించారు. గెడ్డల వద్ద జాగ్రత్త వహించాలని కోరారు.

పాడేరురూరల్: స్థానిక ప్రభుత్వ డిగ్రీకళాశాల ఎన్ఎస్ఎస్ జిల్లా నోడల్ ఆఫీసర్ జి.గౌరీశంకరరావు ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, యూత్ రెడ్ క్రాస్ వలంటీర్లు మంగళవారం గిరిజన గ్రామాల్లో పర్యటించి తుఫాన్‌పై ప్రజలను అప్రమత్తం చేశారు. గ్రామాల్లో తాగునీరు, విద్యుత్, వైద్య సమస్యలు ఏమైనా తలెత్తితే కంట్రోల్ రూమ్ 77802 92811 ఫోన్ ద్వారా సంప్రదించాలని సూచించామన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ రెడ్ క్రాస్ కో-ఆర్డినేటర్ జి.దామోదరరావు, ఎన్ఎస్ఎస్ పీవో బి.దిలీప్ కుమార్, వలంటీర్లు పాల్గొన్నారు.



బొర్రా పునరావాస కేంద్రాన్ని పరిశీలించిన ఏపీసీ స్వామినాయుడు

చింతపల్లి: స్థానిక ఎంపీడీవో సీహెచ్ సీతామహాలక్ష్మి, ఎంపీపీ కోరాబు అనుషదేవి, తహశీల్దార్ కె. శంకరరావుతో కలిసి మంగళారం తాజంగి జలాశయం, బలభద్రం, తాజంగి, సోమవారం బ్రిడ్జీలను పరిశీలించారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. బుధవారం రాత్రి వరకు భారీ వర్షాలు కురిసే అవకాశమున్నందున గ్రామ సచివాలయం ఉద్యోగులు, కార్యదర్శిలు, వీఆర్వో, వీఆర్ఏలతో ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చైతన్యవంతులను చేశామన్నారు. లంబసింగి ఘాట్‌లో భారీ వాహనాల రాకపోకలను నిలిపివేశామన్నారు. ఆర్టీసీ బస్సుల రాకపోకలతను సైతం కుదించడం జరిగిందన్నారు. తుఫాను ప్రభావం తగ్గే వరకు ప్రజలు ప్రయాణాలు చేరాదన్నారు. ఎస్ఎంఐ ఏఈఈ లోకేశ్, ఆర్అండ్‌బీ ఏఈఈ జయరాజ్ పాల్గొన్నారు.

మత్స్యగెడ్డలో తప్పిన పెను ప్రమాదం

ముంచంగిపుట్టు: మండలంలోని సుజనకోట పంచాయతీ కుమ్మరిపుట్టు సమీపంలో మత్స్యగెడ్డపై నాటుపడవకు ప్రమాదం త్రుటిలో తప్పింది. మత్స్యగెడ్డను తాడు సహాయంతో నాటుపడవపై ఆ ప్రాంతీయులు దాటుతుంటారు. గెడ్డ దాటుతుండాఈదురు గాలులు వీయడంతో పడవ తాడు తెగిపోయింది. గెడ్డ మధ్యలో పడవ అదుపు తప్పింది. అయితే పడవను నడుపుతున్న వ్యక్తులు అత్యంత చాకచక్యంగాపడవను ఒడ్డుకు తీసుకురావడంతో సురక్షితంగా బయటపడ్డారు. ఆ సమయంలో పడవలో ఐదుగురు ఉన్నారు. గెడ్డ అవతల సుమారు 19 గ్రామాలకు పైగా గిరిజనులు జీవనం సాగిస్తున్నారు. ఏ చిన్నపాటి అవసరానికైనా పంచాయతీ, మండల కేంద్రాలకు రావాలంటే వారు గెడ్డ దాటాల్సిందే. ఈ స్థితిలో ఉన్నతాధికారులు స్పందించి గెడ్డ దాటేందుకు ఇంజన్ బోట్లు అందించాలని, గెడ్డపై వంతెన నిర్మించాలని ఆ ప్రాంతీయులు కోరుతున్నారు.

రహదారికి అడ్డంగా భారీ వృక్షం

ముంచంగిపుట్టు: మండలంలో గల లక్ష్మీపురం పంచాయతీ సుత్తిగూడ సమీపంలో ప్రధాన రహదారికి అడ్డంగా భారీ వృక్షం నేలకొరిగింది. దీంతో లక్ష్మీపురం, బుంగాపుట్టు పంచాయతీల మధ్య కొంత సమయం రాకపోకలు నిలిచిపోయాయి.విషయం తెలుసుకున్న స్థానిక ఎస్ఐ జె.రామక్రిష్ణ, సర్పంచ్ కె.త్రినాథ్ సంఘటనా స్థలానికి చేరుకుని చెట్టును తొలగించే కార్యక్రమాన్ని చేపట్టారు. విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయడం ఏర్పడింది. ఎస్ఐ జె.రామక్రిష్ణ మత్స్యగెడ్డ పరివాహక ప్రాంతాల్లో ఎస్ఐ పర్యటించారు. తుఫాన్ నేపథ్యంలో ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. చేపల వేటకు వెళ్లరాదని హెచ్చరించారు.

అరకు- విశాఖ రోడ్డులో రాకపోకలు నిలిపివేత

అరకులోయ: మండల స్థాయి అధికారులు పిరిబంద ,మాడగడ, ధంసా నివలసల్లోని గిరిజనులకు అంగన్‌వాడీలు, పాఠశాలల్లో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. అలాగే, సుంకరమెట్ట పంచాయతీ పిరిబంద గ్రామంలో వితంతువు ఇళ్లు కూలిపోయింది. ఈ స్థితిలో మె పునరావాసానికి ఎంపీడీవో లవరాజు, సీఐ హిమగిరి,సచివాలయ సిబ్బంది సర్పంచ్ ఏర్పాట్లు చేశారు. వర్షాలకు ఘాట్‌రోడ్ అంతా అధ్వానంగా మారింది. అలాగే, అనంతగిరి మండలం ఏజెన్సీ ముఖద్వారం చిలకలగెడ్డ వద్ద మంగళవారం సాయంత్రం నుంచి అనంతగిరి, అరకులోయకు వాహనాలు రాకుండా నిలిపివేస్తున్నట్టు ఎంపీడీవో లవరాజు, సీఐ హిమగిరి తెలిపారు.

నూతిబంద వద్ద కోతకు గురైన రహదారి

గూడెంకొత్తవీధి: సీలేరు-జీకేవీధి ప్రధాన రహదారి నూతిబంద గ్రామ సమీపంలో రహదారి కోతకు గురైంది. మంగళవారం తహశీల్దార్ అన్నాజీరావు, ఎస్సై సురేశ్ కోతకు గురైన రహదారిని పరిశీలించి, ప్రమాదాలు జరగకుండగా రాళ్లను అడ్డంగా పెట్టారు. రింతాడ పంచాయతీ పనసలొద్ది గ్రామంలో భారీ వృక్షం ఓ గిరిజన వృద్ధురాలి ఇంటిపై విరిగిపడింది. ఎవరికి ఎటువంటి హాని కలగలేదు. స్థానిక ఎస్సై సురేశ్ గ్రామాన్ని సందర్శించి స్థానిక గిరిజనుల సహకారంతో చెట్టును తొలగించారు.

జి.మాడుగుల: మండలంలోని కుంబిడిసింగి పంచాయతీ రాళ్లగెడ్డలో వరద ఉధృతంగా ప్రవహిస్తుంది. గెమ్మెలి పంచాయతీ జి.కొత్తూరు గ్రామనికి చెందిన బి. వెంకటరావు అనే గిరిజనుడి ఇల్లు పాక్షికంగా దెబ్బతింది. జి.మాడుగుల- చింతపల్లి రహదారిలో కొక్కిరాపల్లి ఘాటీ రోడ్డులో చెట్టుకొమ్మలు విరిగి రహదారిలో పడడంతో స్థానిక సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ షణ్ముఖరావు స్పందించి వాటిని తొలిగించే చర్యలు చేపట్టారు. మండల ప్రత్యేక అధికారి విద్యాసాగర్ పర్యవేక్షించారు. గాంధీనగర్, గురుకుల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను సందర్శించారు. అతని వెంట ఎంపీడీవో ఎస్.డేవిడ్‌రాజు, తహసీల్దార్ రాజ్‌కుమార్, సిబ్బంది చిన్ని తదితరులు పాల్గొన్నారు.

అనంతగిరి: మండలంలోని లంగుపర్తి పంచాయతీ కేంద్రం నుంచి కరకవలస తారురోడ్డులోని మంగళవారం భారీ వర్షాలకు మూడుచోట్ల కొండచరియలు జారిపడడంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

పెదబయలు: మండల కేంద్రంలో సోమవారం అర్ధ రాత్రి నుంచి మంగళవారం మధ్యాహ్నం వరకు ఏకధాటికి కురిసిన వర్షానికి జనజీవనం స్తంభించింది. మండల కేంద్రంతోపాటు పరిసర గ్రామాల్లో చీకటి అలముకుంది. స్థానిక మత్స్యగెడ్డలో జాలరులు చేపల వేటకు వెళ్లరాదని ఎస్ఐ కొల్లి రమణ ఆంక్షలు విధించారు.



జి. మాడుగుల మండలం జి.కొత్తూరులో కూలిన గిరిజనుడి ఇల్లు



నూతిబంద వద్ద రహదారిని పరిశీలిస్తున్న తహసీల్దార్



చిలకలగెడ్డ వద్ద ఘాట్‌రోడ్‌లో రాకపోకలకు నిలిపివేస్తూ ఏర్పాటు చేసిన గేటు



దిగువ మోదాపుట్టు వద్ద కాజ్‌వేపై రాకపోకలను అడ్డుపెట్టిన పోలీసులు



మత్స్యగెడ్డ వద్ద జాలరులతో మాట్లాడుతున్న పెదబయలు ఎస్ఐ రమణ



రహదారిపై చెట్టును తొలగిస్తున్న ముంచంగిపుట్టు పోలీసులు, స్థానికులు



నందిగరువు గ్రామంలో కూలిన భారీ చింత వృక్షం



తాజంగి జలాశయాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో, ఎంపీపీ

తుఫాన్‌పై అప్రమత్తం: ఐటీడీఏ పీవో

అనంతగిరి/ అరకులోయ అక్టోబర్ 28 (ఆంధ్రజ్యోతి):జిల్లా వ్యాప్తంగా మొంథా తుఫాన్‌ను ఎదుర్కొనేలా అన్ని చర్యలు చేపతున్నట్టు ఐటీడీఏ పీవో శ్రీపూజ వెల్లడించారు. మండలంలోని బొర్రా పంచాయతీలోని ఆమె మంగళవారం పర్యటించారు. ముందుగా చప్పాడి వద్ద వంట్లమామిడి గ్రామస్థులను అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగంతో కలిసి ధైర్యం చెప్పారు. చప్పాడి, వంట్లమామిడి గిరిజనులకు సురక్షిత ప్రాంతాల్లో ఇళ్ల నిర్మించుకునేలా చ ర్యలు చేపట్టాలని ఐటీడీఏ పీవోను ఎమ్మెల్యే కోరారు. అనంతరం తహసీల్థార్ వీరభద్రచారితో కలిసి సుమారు కిలో మీటర్ దూరం కాలినడకన చప్పాడి గ్రామానికి పీవో చేరుకున్నారు. స్థానిక సర్పంచ్ అప్పారావు ద్వారా సమస్యను తెలుసుకున్నారు. చప్పాడిలోని ఓ వీధి కొండవాలను ఆనుకుని ఉండడంతో కొండచరియలు జారిపడే ప్రమాదం ఉన్నందున వెనువెంటనే 15 కుటుంబాలకు చెందిన 50కి పైగా గిరిజనులను బొర్రా గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలురు పాఠశాల పునరావాస కేంద్రానికి తరలించే ఏర్పాట్లు చేశారు. సోమవారం రాత్రి కోనాపురం పంచాయతీ వంట్లమామిడి గ్రామం కొండవాలను ఆనుకుని ఉండడంతో మట్టిదిబ్బలు జారిపడ్డాయి. దీంతో 14 కుటుంబాలకు చెందిన 60 మందిని సోమవారం రాత్రి చప్పాడి పాఠశాలలోని పునరావాస కేంద్రానికి, అనంతరం ఉదయం బొర్రాకు తరలించారు. బొండ్యగూడలోని కిల్లో అర్జున్‌కు చెందిన పెంకిటిల్లు కూలిపోయింది. గోస్తనీ పొంగి ప్రవహిస్తుండడంతో బొర్రా హోటల్స్‌ను ఆనుకుని భారీగా కోతకు గురైంది. దీంతో ప్రమాదం పొంచి ఉంది. అలాగే గిరిజనులను పునరావస కేంద్రాలకు తరలింపులో బ్రో (బొర్రా రూరల్ ఆర్గనైజేషన్) ఆధ్వర్యంలోని జీపులను ఏర్పాటుచేసి, సభ్యులు శ్రమించారు. ఎంపీడీవో ప్రభాకర్, డీటీ మాణిక్యం, ఎంపీటీసీ అరుణ, నవీన్, ప్రధాన కార్యదర్శి టి.ఆనందరావు, వీఆర్వోలు, వీఆర్ఏలు, సచివాలయం, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పిరిబందగ్రామాన్ని సందర్శించిన ఎంపీడీవో లవరాజు,సీఐ హిమగిరి

కొత్తభల్లుగుడ బాలికల ఆశ్రమోన్నత పాఠశాల సందర్శన

అరకులోయ: ఐటీడీఏ పీవో శ్రీపూజ మంగళవారం మధ్యాహ్నం కొత్తభల్లుగుడ బాలికల ఆశ్రమోన్నత పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో విద్యార్థుల హాజరు పరిశీలించారు. వసతిగృహంలో సౌకర్యాలు, విద్యా భోధన, మెనూ అమలుపై ఆరా తీశారు. విద్యార్థులకు ఆరోగ్యం కోసం వేడినీళ్లను సరఫరా చేశారు. అనారోగ్యంతో ఉన్న చిన్నారులను తల్లిదండ్రులతో ఇళ్లకు పంపవద్దని, అసుపత్రిలో వైద్యం అందించాలన్నారు. హెచ్ఎం పద్మావతి, వార్డెన్ లక్ష్మీ పీవో వెంట ఉన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం

గూడెంకొత్తధి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): పెంటపాడు జాతీయ రహదారిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వాసిరెడ్డి దావీదు కుటుంబానికి శ్రీ మహిళా మాతోట మ్యాక్స్ సొసైటీ ఆర్థిక సహాయాన్ని అందజేసింది. మంగళవారం మాతోట మ్యాక్స్ సొసైటీ మేనేజర్ జల్లి బాబూరావు సిబ్బంది నగదును అందజేశారు. ఈసందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ దావీదు రూ.63వేలు చెల్లించాల్సివుందన్నారు. ఆయన మరణించడంతో ఆయన తీసుకున్న రుణాన్ని మాఫీ చేస్తూ సీఈవో నెల్లూరి సత్యనారాయణ జారీ చేసిన పత్రాన్ని అందజేశామన్నారు. ఆలాగే తక్షణ సహాయంగా రూ.ఐదు వేల నగదును అందజేశామన్నారు. ఈకార్యక్రమంలో శ్రీ మహిళా మాతోట మ్యాక్స్ సొసైటీ సీనియర్ ఫీల్డ్ అధికారి ఎల్‌వీ సుబ్బారావు, డైరెక్టర్ బురిటి ఈశ్వరి, సిబ్బంది పుణ్యవతి పాల్గొన్నారు.



మృతుడు భార్యకు నగదును అందజేస్తున్న మ్యాక్స్ సొసైటీ మేనేజర్ బాబూరావు

ఏపీఎన్‌జీసీ జిల్లా కోఆర్డినేటర్‌గా కొండబాబు

అనంతగిరి, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఏపీ నేషనల్ గ్రీన్ క్రాప్స్ జిల్లా కోఆర్డినేటర్‌గా శివలింగపురం ప్రభుత్వ గిరిజన సంక్షేమశాఖ ఆశ్రమ పాఠశాల బయాలజీ స్కూల్ అసిస్టెంట్ గుజ్జెలి కొండబాబును నియమిస్తూ విజయవాడ పర్యావరణ, అటవీ సైన్స్, టెక్నాలజీశాఖ డైరెక్టర్ పి. స్రవంతి మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. విద్యార్థుల్లో పర్యావరణంపై అవగాహన కల్పిస్తూ పాఠశాల ఆవరణలో గ్రీన్ క్రాప్ క్లబ్స్, పార్కులు ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈమేరకు జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో నేషనల్ గ్రీన్ క్రాప్స్ కార్యక్రమాలకోసం జిల్లా కోఆర్డినేటర్లను ప్రభుత్వం నియమించింది. ఈమేరకు కొండబాబుని డైరెక్టర్ కోఆర్డినేటర్‌గా నియమించింది.

పునరావాస కేంద్రానికి 66 మంది తరలింపు


పునరావాస కేంద్రానికి తరలించిన యానాదుల కుటుంబాలు

నర్సీపట్నం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ నేపథ్యంలో బలిఘట్టం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి 66 మంది యానాదుల కుటుంబ సభ్యులను అధికారులు తరలించారు. వీరంతా బ్రహ్మలింగేశ్వరస్వామి గుడి వెనుక పాకలు వేసుకొని నివాసం ఉంటున్నారు. పాత ఇనుము, కాగితాలు, ప్లాస్టిక్ ఏరుకొని జీవనాధారం పొందుతుంటారు. ముందస్తు జాగ్రత్తగా రెవెన్యూ అధికారులు ఈ చర్యలు చేపట్టారు. భోజనాలు, పిల్లలకు బిస్కట్లు తదితరాలను అందిస్తున్నారు. విద్యుత్ సరఫరాలో అవాంతరం ఏర్పడితే సమస్య రాకుండా ఉండేందుకు జనరేటర్ ఏర్పాటు చేశారు. తహశీల్దార్ రామారావు, మండల ప్రత్యేక అధికారి శ్రీనివాసరావు, మునిసిపాలిటీ పత్యేక అధికారి పి.జయంతి పునరావాస కేంద్రాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ నాయుడు, వీఆర్వో లక్ష్మి పాల్గొన్నారు.

ఘనంగా కౌన్సిలర్ రాజేశ్ జన్మదిన వేడుకలు


రాజేశ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న టీడీపీ నాయకులు

నర్సీపట్నం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : మునిసిపాలిటీ 25వ వార్డు టీడీపీ కౌన్సిలర్ చింతకాయల రాజేశ్ జన్మదిన వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఇక్కడి శివపురంలోని తమ నివాసంలో పలువురు టీడీపీ నాయకులు కేట్ కట్‌చేసి, పుష్పగుచ్ఛాలను అందజేసి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు కౌన్సిలర్లు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌కు గురై మహిళకు తీవ్ర గాయాలు

నర్సీపట్నం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ 28వ వార్డు అయ్యన్న కాలనీలో విద్యుద్ఘాతంతో మహిళ తీవ్రంగా గాయపడింది. కాలనీకి చెందిన సోమురెడ్డి రామలక్ష్మి డాబా ఇళ్ల మొదటి అంతస్తులో మంగళవారం నిలబడి ఉండగా, షాక్‌కు గురైంది. వెంటనే 108 అంబులెన్స్‌లో ప్రాంతీయ ఆస్పత్రికి తరలించగా అక్కడ నుండి మెరుగైన వైద్యం కోసం విశాఖపట్నం కేజీహెచ్‌కు వైద్యులు తరలించారు. ఆమె పరిస్థితి విషమంగా ఉందని బంధువులు తెలిపారు. కాలనీ మధ్య నుంచి 11కేవీ విద్యుత్ లైన్ ఉంది. తీగలు ఇళ్లను తాకుతూ ఉన్నాయని, రెండు అడుగుల దూరంలో నిలబడినా షాక్‌కు గురవుతున్నామని అక్కడివారు తెలిపారు. ఈ సమస్యను విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకు వెళ్లినా పట్టించుకోలేదని వాపోతున్నారు.


ఏకధాటి వర్షాలకు గొలుగొండ మండలం కృష్ణాదేవిపేటలో ఉరకలేస్తూ ప్రవహిస్తున్న బొడ్డేరు గెడ్డ


భారీ వర్షాల వల్ల నీరు నిలిచిపోకుండా నర్సీపట్నంలో కాలువను శుభ్రం చేయిస్తున్న మునిసిపల్ కమిషనర్ సురేంద్ర


గొలుగొండ మండలం కొత్తఎల్లవరంలోని పునరావాస కేంద్రంలో డొంకాడ గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎస్ఐ రామారావు

రోజంతా ముసురే!

- స్తంభించిన జనజీవనం
- ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, వంకలు, నదులు
- బలిఘట్టం పెట్రోల్ బంక్ సమీపంలో కూలిన చెట్టు
- వెంటనే స్పందించిన మునిసిపల్ కమిషనర్


మాకవరపాలెంలో ఉధృతంగా ప్రవహిస్తున్న వరహానది

నర్సీపట్నం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ ప్రభావంతో రెండు రోజులుగా నర్సీపట్నం నియోజకవర్గంలో ముసురు వాతావరణం నెలకొని ఉంది. మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు అడపాదడపా వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాల్లో ఎక్కడికక్కడ నీరు నిలిచిపోయింది. రోడ్లు బోసిపోయి కనిపించారు. పలు గ్రామీణ రహదారులు చిత్తడిగా మారాయి. నర్సీపట్నంలో మునిసిపల్ కమిషనర్ జంపా సురేంద్ర డ్రైనేజీ కాలువలలో నీటి ప్రవాహానికి ఆటంకం లేకుండా శుభ్రం చేయించారు. సోమవారం అర్ధరాత్రి బలిఘట్టం పెట్రోల్ బంక్ సమీపంలో చెట్టు రోడ్డు మీద పడిపోవడంతో నైట్ రౌండ్స్‌లో ఉన్న పట్టణ పోలీసులు గమనించి సహాయక చర్యలు చేపట్టారు. చెట్టు కొమ్మలను కట్టర్ సహాయంతో తొలగించి వాహనాలు రాకపోకలకు అంతరాయం లేకుండా చేశారు. వరద నీరు చేరడంతో బలిఘట్టం వరహానది ఉధృతంగా ప్రవహిస్తున్నది.

ఉధృతంగా ప్రవహిస్తున్న వరహా నది

మాకవరపాలెం : తుఫాన్ కారణంగా మంగళవారం ఉదయం నుంచి మండలంలో భారీ వర్షం కురుస్తోంది దీంతో సాగునీటి కాలువలు, కొండగెడ్డలు, సర్పా, వరహా నదుల్లో భారీగా నీరు చేరింది. తామరం లచ్చిచెరువు పూర్తిగా నిండిపోవడంతో ఇరిగేషన్ అధికారులు గట్టును పరిశీలించారు. ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు నదుల్లో భారీగా నీరు చేరుతుంది. దీంతో వరహానది ఉధృతంగా ప్రవహిస్తుంది. నది వద్దకు ప్రజలు వెళ్లకుండా అధికారులు చర్యలు చేపట్టారు. అలాగే, నది పరీవాహక ప్రాంతాలైన నారాయణరాజుపేట, జంగాలపల్లి, బీఎస్‌పేట, తాడపాల గ్రామాల్లో ఉన్న ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. ఇదిలావుంటే, లచ్చన్నపాలెంలో పాతబడిన పెంకుటిల్లు నేలకూలింది. అయితే ఆ ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ఎటువంటి ప్రమాదం జరగలేదు. సదరు ఇంటికి తహశీల్దార్ వెంకటరమణ, ఎంపీడీవో సుధ, ఇతర అధికారులు పరిశీలించారు. తుఫాన్ వల్ల ఎటువంటి నష్టం జరగకుండా అప్రమత్తంగా ఉండడంతో పాటు అవసరమైన చర్యలు చేపట్టామని వారు విలేకరులకు తెలిపారు. అలాగే, వర్షం కారణగా తామరం గ్రామంలోని పలు ఇళ్లలోకి నీరు చేరింది. మెయిన్ రోడ్డుకు ఆనుకుని ఇరువైపులా ఉన్న మదుములను తొలగించడంతో వర్షాలు వస్తే తాము ఈ పరిస్థితిని ఎదుర్కొంటున్నామని అక్కడివారంతా వాపోతున్నారు. ఈ సమస్యపై అధికారులు వెంటనే స్పందించాల్సిందిగా కోరారు.

పునరావాస కేంద్రాలకు పలు గ్రామాల ప్రజలు

గొలుగొండ : తుఫాన్ కారణంగా మండలంలో మంగళవారం భారీ వర్షం కురిసింది. ధారగెడ్డ, గొరిగెడ్డ, పాలగెడ్డ పొంగి ప్రవహించాయి. ముందు జాగ్రత్త చర్యగా కొత్త ఎల్లవరం శివారు డొంకాడ గ్రామస్థులను కరక పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి తరలించారు. ఆర్డీవో రమణ, ఇన్‌చార్జి తహసీల్దార్ రామారావు, ఎస్ఐ రామారావు, సర్పంచ్ కొల్లి రాంబాబు వారిని కలిసి సౌకర్యాల గురించి తెలుసుకున్నారు. వీరికి టిఫిన్లు, భోజనాలు తదితర సౌకర్యాలు కల్పించారు. జోగంపేట గ్రామంలో పూరింట్లో నివాసం ఉంటున్న కొంతమందిని జోగంపేట హైస్కూల్‌లోకి తరలించారు. డీఎల్‌పీవో మూర్తి, ఇన్‌చార్జి ఎంపీడీవో ఉలబాల శ్రీనివాసరావు వీరికి అవసరమైన ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. అనంతరం తాండవ రిజర్వాయర్ పరీవాహక గ్రామాల్లో పర్యటించి అప్రమత్తం చేశారు.

చెరువులు, గెడ్డలు, వాగులకు జలకళ

కృష్ణాదేవిపేట : తుఫాన్ ప్రభావంతో చెరువులు, గెడ్డలు, వాగులు నీటితో కళకళలాడుతున్నాయి. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఏఎల్‌పురం, పాతకృష్ణాదేవిపేట, చోద్యం, నాగాపురం, కొంగశింగి, లింగంపేట, విప్పలపాలెం తదితర గ్రామాల్లో రోడ్లు తడిసి ముద్దయ్యాయి. జనజీవనం స్తంభించిపోయింది. ఏఎల్‌పురం హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని గొలుగొండ డిప్యూటీ తహశీల్దార్ చైనులు, ఇతర అధికారులు పరిశీలించారు. ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

చురుగ్గా వరద సహాయక కార్యక్రమాలు

నాతవరం : తుఫాన్ కారణంగా మండల వ్యాప్తంగా మంగళవారం ఉదయం నుంచి వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. వరద సహాయ కార్యక్రమాల్లో మాధవనగరంలో తహశీల్దార్ వేణుగోపాల్, ఎంపీడీవో సత్య శ్రీనివాస్, నర్సీపట్నం సీఐ రేవతమ్మ, నాతవరం ఎస్ఐ తారకేశ్వరరావు తదితరులు చురుగ్గా పాల్గొంటున్నారు. వృద్ధులను, పూరిళ్లలో ఉన్నవారిని తుఫాన్ షెల్టర్‌లకు తరలించి భోజన ఏర్పాటు చేపట్టారు. విరిగిన చెట్లు, విద్యుత్ స్తంభాలను పరిశీలించి ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా వెనువెంటనే చర్యలు చేపడుతున్నారు. ఎంబీపట్నం పంచాయతీ శివారు ఎ.శరభవరం వద్ద ఏలేరు కాలువ వలన వరద ముంపు అయ్యే ప్రాంతాన్ని బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ రాజాన వీరసూర్యచంద్ర, జనసేన నాయకులు వెలగల వెంకటరమణ పోలుపర్తి శ్రీనివాసరావు తదితరులు పరిశీలించి అక్కడివారికి ధైర్యం చెప్పారు. అలాగే మంగళవారం తాండవ స్పిల్‌వేగేట్లు రెండింటిని ఎత్తి నీటిని తాండవనదికి డీఈఈ అనురాధ విడుదల చేశారు. మాధవనగరంలో టీడీపీ నాయకులు గంటా శ్రీనివాసరావు వృద్ధులను తుఫాన్ షెల్టర్‌కు తరలించడంతో అధికారులకు సహాయపడ్డారు. తుఫాన్ ముగిసేవరకు తాండవ రిజర్వాయర్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని తాండవ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కరక సత్యనారాయణ పేర్కొన్నారు. మునిసిపల్ కౌన్సిలర్ చింతకాయల రాజేష్‌తో కలిసి ఆయన తాండవ రిజర్వాయర్‌ను పరిశీలించి నీటినిల్వలను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం స్పిల్‌వేగేట్లు ద్వారా రెండు వేలకు పైగా క్యూసెక్కుల నీటిని తాండవనదికి విడుదల చేస్తున్నారని చెప్పారు. వర్షాలు ఎక్కువైతే అదనపు నీటిని ఇంకా విడుదల చెయ్యాలన్నారు.

తుఫాన్ ప్రభావంపై ఎమ్మెల్యే బండారు సమీక్ష


అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

కె.కోటపాడు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ నేపథ్యంలో స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి అన్ని శాఖల అధికారులతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈదురుగాలులకు గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు, చెట్లు కూలినా, పంట నష్టం, ఇతర ఆస్తుల నష్టాన్ని తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూముకు తెలియజేయాలని ఈ సందర్భంగా ప్రజలను కోరారు. అధికారులందరూ అందుబాటులో ఉండాలన్నారు. శారదానది చిట్టిగెడ్డ, పెద్దిగెడ్డ, మొండిగెడ్డలు ఉధృతంగా ప్రవహిస్తున్నందున పశువులను, మేకలు, గొర్రెలను అటువైపు తీసుకువెళ్లకుండా గ్రామాల్లో దండోరా వేయించాలని అధికారులను ఆదేశించారు.గ్రామాల్లో వరి పంట నేలకొరిగి నీటిలో ఉన్నందున వ్యవసాయ అధికారులు రైతులకు పలు సూచనలు అందించాలన్నారు. ఈ సమావేశంలో మండల ప్రత్యేక అధికారిణి పూర్ణిమదేవి, తహసీల్దార్ భుజంగరావు, ఎంపీడీవో స్వాంబశివరావు, ఎస్ఐ ధనుంజయ్, విద్యుత్ ఏఈ చంద్రశేఖర్, ఏవో సోమశేఖర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

పాఠశాల భవన నిర్మాణానికి డైమండ్ జ్యూవెలరీస్ సాయం


నంబారువానిపాలెంలో శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

చోడవరం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): శిథిలావస్థలో ఉన్న మండలంలోని గంధవరం పంచాయతీ కొత్తపల్లి శివారు నంబారువానిపాలెంలో ప్రభుత్వ పాఠశాల భవన నిర్మాణానికి ప్రముఖ డైమండ్ జ్యూవెలరీ తయారీ కంపెనీ ముందుకు వచ్చింది. పాఠశాల భవనం పూర్తిగా స్లాబు లీకై వానపడితే ఇబ్బందిపడే స్థితికి చేరుకుంది. దీని స్థానంలో రూ.36 లక్షలతో కొత్త భవనం నిర్మించడానికి కంపెనీ ముందుకు వచ్చింది. మంగళవారం కంపెనీ ఫైనాన్సియల్ హెడ్ రుషికేశ్‌తో పాటు, స్థానిక పెద్దలు పల్లా అర్జున్ తదితరులు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కంపెనీ సిబ్బంది ప్రతాప్, నాగార్జున, కాంట్రాక్టర్ సూర్య, హెచ్ ఎం. జయకృష్ణ, స్కూల్ కమిటీ చైర్మన్ రమణ, స్థానిక నాయకులు పల్లా అప్పారావు, తోనంగి అప్పలనాయుడు, మొల్లి నానాజీ, ఒమ్మి శ్రీను, దేవర రవికుమార్, ఎలమంచిలి అప్పారావు, నంబారు ఈశ్వరరావు, విద్యార్థుల తల్లిదండ్రులు స్థానికులు పాల్గొన్నారు.

పునరావాస కేంద్రాలకు తరలింపు


కొక్కిలబంద నుంచితీసుకు వస్తున్న కానిస్టేబుల్ హరి, కార్యదర్శి

దేవరాపల్లి, అక్టోబరు28 (ఆంధ్రజ్యోతి):చింతలపూడి పంచాయతీ శివారు కొక్కిలబంద గిరిజనులకు 25 మందిని కానిస్టేబుల్ హరి, కార్యదర్శి ఈశ్వరరావు జోక్యంతో పునారాస కేంద్రాలకు తరలించారు. గిరిజనులు గ్రామం విడిచి వెళ్లడానికి విముఖత చూపలేదు. చింతలపూడి పంచాయతీ పునరావాస కేంద్రానికి 44 మందిని, తరలించారు. కొక్కిలబంద గ్రామం నుంచి 25మంది, చింతలపూడి పంచాయతీ పరిసర ప్రాంతాలను పాకల్లో ఉంటున్న వారిని 19 మంది అధికారులు సురక్షిత ప్రదేశాలకు తరలించారు. ఎస్.ఐ.సత్యన్నారాయణ, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు సూర్యనారాయణ బురద రోడ్డులో ట్రాక్టరుతో వెళ్లి పునరావాస కేంద్రానికి తరలించారు. మండల ప్రత్యేక అధికారి మంజులవాణి, తహసీల్దార్ పి.లక్ష్మీదేవి, ఎంపీడీఓ సువర్ణరాజు పాల్గొన్నారు.


తుఫాన్ వర్షాలకు రావికమతంలో ఓ ఫ్లోరు మిల్లులో చేరిన వర్షపు నీరు


చోడవరం పునరావాస కేంద్రంలో ఆహారం అందజేస్తున్న అధికారులు


చోడవరం బాలాజీనగర్‌లో మోకాలి లోతు నీరు

జనజీవనం అస్తవ్యస్తం

- వర్షాలకు నీటమునిగిన కాలనీలు.. వరి చేలు
- పునరావాస ప్రాంతాలకు

ముంపు బాధితుల తరలింపు

చోడవరం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తుపాను ప్రభావంతో సోమవారం అర్ధరాత్రి నుంచి కురిసిన భారీ వర్షానికి పట్టణ పరిధిలోని పలు కాలనీల్లో వరదనీరు ముంచెత్తింది. ప్రధాన రహదారిపై నీరుఏరులా పారింది. చోడవరం చీడికాడ రోడ్డులో వరదనీరు వాగును తలపించింది నివాస గృహాల్లోనికి వరదనీరు చేరడంతో, స్థానిక బానయ్యకోనేరు, ద్వారకానగర్ పరిసర ప్రాంతాల స్థానికులను తాత్కాలికంగా ఏర్పాటు చేసిన పునరావాస శిబిరాలకు అధికారులు తరలించారు. సోమవారం అర్ధరాత్రి నుంచి భారీ వర్షం కురవడంతో స్థానిక బాలాజీనగర్, బానయ్య కోనేరు, రెల్లికాలనీల్లోని నివాసాల్లోనికి వరదనీరు చేరింది. బాలాజీనగర్‌లో రాత్రంతా స్థానికులు ఇళ్లల్లోని నీటిని బయటకు తోడుకుంటూ గడిపారు. బానయ్య కోనేరు, ద్వారకానగర్, రెల్లికాలనీ ప్రాంతాల్లోని స్థానికులను తహసీల్దార్ రవికుమార్‌తో పాటు, ఎండీవో ఆంజనేయులు, పంచాయతీ ఈవో శ్రీనివాసరావు టీడీపీ నాయకులు సకురు కోటేశ్వరరావు, మెంబరు శ్రీను, నేమాల హరి తదితరులు దుడ్డువీధిలోని పునరావాస కేంద్రానికి తరలించారు. సీఐ అప్పలరాజు పాల్గొన్నారు. బాలాజీనగర్, బానయ్య కోనేరు ప్రాంతాల్లోని వరదనీరు బయటకు వెళ్లేఆ ఎక్స్‌కవేటర్‌తో కాలువల్లో పూడిక తొలగించారు.

గోవాడలో నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు

మండలంలోని గోవాడలో సోమవారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షానికి మూడు చోట్ల విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. ఈ స్థితిలోఈపీడీసీ ఎల్ సిబ్బంది మంగళవారం ఉదయం విద్యుత్ సరపరాకు అంతరాయం లేకుండా చూశారు. ద్వారకానగర్ లక్ష్మీపురం రూట్లో విద్యుత్ స్తంభాలపై వాలిపడిన కొమ్మలను విద్యుత్ సరపరాకు ఆటంకం లేకుండా చూశారు.

శారదా, పెద్దేరు నదుల్లో పెరిగిన నీటి ప్రవాహం

తుపాను ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షానికి వరద ప్రవాహం పెరగడంతో రైవాడ, పెద్దేరు రిజర్వాయర్ల నుంచి నీరు దిగువకు విడుదల చేస్తున్నారు. శారదాలో వరద ప్రవాహం పెరిగింది. మండలంలోని జన్నవరం వద్ద పెద్దేరు వరద ఉధృతి ఎక్కువగానే ఉంది. దీంతో మండలంలో కన్నంపాలెం, చాకిపల్లి, రామజోగిపాలెం, భోగాపురం తదితర ప్రాంతాల్లోని వ, చెరకుతోటలు నీటిముంపునకు గురయ్యాయి.

శారదా, పెద్దేరు నదుల్లో పెరిగిన నీటి ప్రవాహం

చోడవరం: శారదా, పెద్దేరు నదుల్లో వరద ప్రవాహం పెరగింది. రైవాడ, పెద్దేరు రిజర్వాయర్ల నుంచి నీరు దిగువకు విడుదల చేస్తున్నారు.

నీటిలో పొలాలు

మండలంలోని జన్నవరం వద్ద పెద్దేరు వరద ఉధృతి బాగా ఎక్కువగానే ఉంది. మండలంలోని లోతట్టు ప్రాంతాలైన కన్నంపాలెం, చాకిపల్లి, రామజోగిపాలెం, భోగాపురం తదితర ప్రాంతాల్లోని పొలాలు, చెరకుతోటలు నీటిముంపునకు గురయ్యాయి.

చీడికాడ అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావం తగ్గే వరకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలలో ఉండాలని తహశీల్దార్ కిషోర్ లింకన్ కోరారు. మండలంలో కోనాం శివారు జూజూలపాలెం, వీరభద్రుని పేట శివారు జైపురం ముడిచర్ల గిరిజన గ్రామాలలో మంగళవారం సమావేశమయ్యారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ కృష్ణ వీఆర్‌ఓలు కోరుకొండ అప్పారావు, వి లక్ష్మి కుమార్ రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రావికమతంలో..

రావికమతం: తట్టబంద- జె.నాయుడు పాలెం రోడ్డులో తట్టబంద సమీపంలో చెట్టు విరిగి పడడంతో రెండు విద్యుత్ స్తంభాలు నేలమట్టమయ్యాయి. మట్టవానిపాలెం వద్ద నల్ల కొండ గెడ్డ ఉధృతికి వరి పోలాలు నీట మునిగాయి. టి.అర్జాపురం ఎన్టీఆర్ కాలనీలోనూ, ధర్మవరం గ్రామాలలో రెండు ఇళ్ల చెట్లు కూలాయి. వీటిని అధికారులు వెంటనే తొలగించారు. గొంప అల్లం చెరువు గెడ్డ ఇరు వైపులా రావికమతం ఎస్ఐ ఎం.రఘువర్మ కర్రలను అడ్డం పెట్టి రాకపోకలను నిలిపివేశారు. అనకాపల్లి నుంచి వయా గొంప మీదుగా రావికమతం వచ్చే ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాల రాకపోకలు ఆగిపోయాయి.రావికమతంలో పోలీస్ స్టేషన్‌కు సమీపంలో ఓ ఫ్లోరు మిల్లులో వర్షపు నీరు ప్రవేశించింది. కల్యాణపులోవ జలాశయాన్ని తహసీల్దార్ అంబేద్కర్ మంగళవారం పరిశీలించారు.ఈ రిజర్వాయర్‌లో ప్రస్తుతం ఇన్‌ఫ్లో 200 క్యూసెక్కుల మేర వచ్చి చేరుతున్నందు న నీటిని విడిచిపెడుతున్నామని ఏఈ తహసీల్దార్ తెలిపారు. రావికమతం చీమలపాడు శివారు కొండ శిఖర గ్రామమైన జీలుగులోవలో పూరిళ్లలో ఉంటున్న ఏడు కుటుంబాలకు చెందిన 30 మంది పీవీటీజీలను ముందు జాగ్రత్త చర్యగా మంగళవారం చీమలపాడు పునరావాస కేంద్రానికి అధికారులు తరలించినట్టు తహసీల్దార్ అంబేద్కర్, ఎంపీడీవో మహేష్ తెలిపారు.

పునరావాస కేంద్రానికి గిరిజనుల తరలింపు

రోలుగుంట : మండలంలోని రోలుగుంట, శరభవరం గ్రామాల్లో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు ఎంపీడీఓ నాగేశ్వరరావు తెలిపారు. మండల ప్రత్యేకాధికారి నాగలక్ష్మి ఆధ్వర్యంలో మండల శాఖ అధికారులతో కలిసి వెళ్లి గిరిజన గ్రామాలైన లోసింగి, పెదగరువు, కొత్తలోసింగిలకు చెందిన 50 గిరిజన కుటుంబాలను శరభవరం పాఠశాలలోని పునరావాస కేంద్రానికి తరలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నాగమ్మ, ఎస్సై రామకృష్ణారావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.


గిరిజన కుటుంబాలతో మాట్లాడుతున్న తహశీల్దార్ కిషోర్ లింకన్

కె.కోటపాడులో వర్షం

కె.కోటపాడు: వర్షంతో స్థానిక ప్రధాన రహదారి పై వర్షం నీరు పారింది. రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తాయి. అలాగే లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పలుచోట్ల వరి పొలాల్లోకి వర్షం నీరు చేరింది. గ్రామీణరోడ్లు ఛిద్రంగా మారి పలు గ్రామాలకు రాకపోకలు అవస్థలు తప్ప లేదు.

దేవరాపల్లి: మండలంలో కురుస్తున్న వర్షాలకు 22 ఎకరాలకు పైగా పంట మునిగిపోగా, మరో ఇరవై ఎకరాల్లో పంట నేలకు ఒరిగినట్టు మండల వ్యవసాయ అధికారి ఎల్.వై.కాంతమ్మ మంగళవారం తెలిపారు. ఈ పంట రక్షణకు చర్యలను వివరించారు.

మాడుగుల: మండలంలో పలు చోట్ల మంగళవారం గాలులతోపాటు వర్షం కురిసింది. జనాలు ఇళ్లనుంచి బయటకు రాలేదు.

బుచ్చెయ్యపేట: మండలంలో వడ్డాది, విజయరామరాజుపేటలలో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు మండల స్పెషల్ ఆఫీసరు గోపాలరాజు తెలిపారు. అధికారుల బృందం మంగళవారం మధ్యాహ్న భోజన ఏర్పాట్లు పరిశీలించారు. పునరావాస కేంద్రాలకు విద్యుత్ సదుపాయం కల్పించారు. తహసీల్దార్ ఎం. లక్ష్మి, ఎంపీడీవో శివ ప్రసాద్ నారాయణ రావు, ఎంఈవో బుద్ధ కాశి విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


శరభవరం గిరిజనులను పునరావాసకేంద్రాలకు తరలిస్తున్న దృశ్యం

రహదారికి గండి

మాడుగుల రూరల్ : ఎం.కోడూరు- ఓకేశీరాంపురం రోడ్డు మార్గంలోని పెద్ద చెరువు మదుము వద్ద రహదారికి గండి పడింది. మండల ప్రత్యేక అధికారి శివప్రసాద్, తహసీల్దారు రమాదేవి, ఎంపీడీవో అప్పారావు, ఇరిగేషన్ జేఈ భావన తదితర అధికారులు ఈ ప్రదేశాన్ని పరిశీలించారు. గండి పూడ్చి వేతకు చర్యలు చేపట్టారు. అలాగే శంకరం పంచాయతీలో ఉరకగెడ్డ, అవురువాడ పంచాయతీలో గొర్రిగెడ్డ వాగులను పరిశీలించారు. గెడ్డ అవతల నుంచి రాకపోకలు సాగించకుండా వీఆర్‌వోలు, సచివాలయం సిబ్బంది, అధికారులు చర్యలు చేపట్టారు. మాడుగుల ఎస్ఐ జి.నారాయణరావు పెద్దేరు జలాశయం వద్ద పర్యాటకులు రాకూడదని హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ఎం.కోడూరు వద్ద రోడ్డు పక్కనే భారీ వృక్షం వాలిపోయింది. పొంగలిపాకలో పడాల చెరువు మదుము వద్ద చెరువు గట్టు రోడ్డుకి మధ్య గండిపడటంతో స్థానిక కూటమి నాయకులు ఉండూరు దేముడు, ఎంపీటీసీ షెచర్ల సన్యాసిరావు, సత్యనారాయణలు ఎక్స్‌కవేటర్‌తో గండిపూడ్చారు. అవురువాడ, విజేపురం, శంకరం పంచాయతీ పరిధిలోని పూరిళ్లలో ఉన్న వాళ్లను పునరావాస కేంద్రాలకు తీసుకు వచ్చినట్టు అధికారులు తెలిపారు. కింతలి గ్రామానికి చెందిన మొం డెపు వరహాలదొర అనే రైతుకి చెందిన పాడి ఆవు గ్రామసమీపాన గల పెద్ద గెడ్డలో మునిగి చనిపోయింది. తహసీల్దారు రమాదేవి, ఎంపీడీవో అప్పారావు వెళ్లి బాధిత రైతుని పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.


గండిపడిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న అధికారులు

కుండపోత!

... 5వ పేజీ తరువాయి

అచ్యుతాపురంలో 35.4, దేవరాపల్లిలో 35.8, పాయకరావుపేటలో 35.2, చోడవరంలో 32, నక్కపల్లిలో 30.4, ఎస్.రాయవరంలో 30.2, మునగపాకలో 27.2, బుచ్చెయ్యపేటలో 27, ఎలమంచిలిలో 24.6, చీడికాడలో 23.8, కోటవురట్లలో 22.6, నర్సీపట్నంలో 23.2, రావికమతంలో 21.2, పరవాడలో 18.8, రోలుగుంటలో 18.8, రాంబిల్లిలో 16.6, నాతవరంలో 16.8, మాడుగులలో 14.6, సబ్బవరంలో 14.6, మాకవరపాలెంలో 14.4, అనకాపల్లిలో 10.4, గొలుగొండలో 9.2, కశింకోటలో 5.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.

భారీ వర్షాలు, ముసురు వాతావరణంతో ప్రజా జీవనానికి అంతరాయం కలిగింది. అచ్యుతాపురం, పరవాడ, రాంబిల్లి, ఎస్.రాయవరం, నక్కపల్లి, పాయకరావుపేట మండలాల్లో సముద్ర అలల తాకిడి పెరిగింది. సాధారణ రోజులతోపోలిస్తే ఒక మీటరు ఎత్తువరకు అలలు ఎగిసిపడుతున్నాయి.

మండలాల్లో పరిస్థితి..

అనకాపల్లి మండలం వెంకుపాలెం సమీపంలో రహదారి మీదుగా వెదుళ్లగెడ్డ ఉధృతంగా ప్రవహిస్తుండడంతో సుమారు ఐదు గ్రామాల ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. ఎస్పీ తుహిన్‌సిన్హా ఇక్కడకు వచ్చి పరిశీలించారు. ప్రజలు వెదుళ్లగెడ్డ దాటకుండా చూడాలని పోలీసులను ఆదేశించారు.

అనకాపల్లి పట్టణంలో సోమవారం అర్ధరాత్రి నుంచి వర్షం కురుస్తూనే ఉంది. ఎప్పటి మాదిరిగానే ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణ చెరువులా మారింది. ఎస్పీ తుహిన్ సిన్హా వచ్చి పరిశీలించారు. వర్షం నీటిని బయటకు పంపడానికి ఏర్పాట్లు చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో ఆరుబయట జనసంచారం బాగా తగ్గిపోయింది. దీంతో పలు వ్యాపార, వాణిజ్య సంస్థలను తెరవలేదు. పలుచోట్ల చెట్లు నేలకూలాయి. జీవీఎంసీ సిబ్బంది యంత్రాలతో వచ్చి పక్కకు తొలగించారు. శ్రీరామనగర్‌కాలనీ వద్ద ఉన్న హాస్టల్ భవనం శిథిలావస్థకు చేరడంతో ఇందులో వున్న 140 మంది విద్యార్థులను గాంధీ నగరం ఉన్నత పాఠశాలకు తరలించారు.

చోడవరంలో సోమవారం అర్ధరాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు కురిసిన భారీ వర్షంతో బానయ్య కోనేరు, ద్వారకానగర్, రెల్లికాలనీ ప్రాంతాలు నీటమునిగాయి. లోతట్టు ప్రదేశాల్లోని ఇళ్లలోకి నీరు చేరింది. బానయ్యకోనేరు, ద్వారకానగర్ వాసులను దుడ్డువీధిలోని పునరావాస శిబిరానికి తరలించారు.

వర్షం నీటితో పలు రహదారులు వాగులను తలపించాయి. శారదా, పెద్దేరు నదుల్లో వరద ప్రవాహం పెరగడంతో కన్నంపాలెం, చాకిపల్లి, రామజోగిపాలెం, భోగాపురం తదితర గ్రామాల్లో వరి పొలాలు, చెరకు తోటలు ముంపునకు గురయ్యాయి.

రావికమతం మండలంలో సోమవారం అర్ధరాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు భారీ వర్షం కురిసింది. గాలులు వీయడంతో వరిపైరు నేలవాలింది. తట్టబంద సమీపంలో చెట్టు విరిగి విద్యుత్ తీగలపై పడడంతో రెండు స్తంభాలు విరిగిపోయాయి. సిబ్బంది వెంటనే వచ్చి చెట్టును తొలగించి, కొత్త స్తంభాలు వేశారు.

పరవాడ మండలం నాయుడుపాలెం పంచాయతీ పరిధిలో రెండు విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. వెంకటపతిపాలెం సమీపంలో భారీ వృక్షం రహదారిపై కూలిపోయింది.

మాకవరపాలెం మండలంలో వరహా, సర్పా నదులు, గెడ్డల్లో వరద ఉధృతి పెరిగింది. ఆయా గ్రామాల వద్ద ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. సాగునీటి చెరువులు పూర్తిగా నిండాయి. లచ్చన్నపాలెంలో నివాసయోగ్యంగా లేని పురాతన పెంకుటిల్లు కూలిపోయింది.

తుఫాన్ కారణంగా ఈదురు గాలులు వీస్తుండడంతో కోటవురట్ల మండలంలో మంగళవారం ఉదయం నుంచి రాత్రి ఏడు గంటలకు వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. కైలాసపట్నం రామచంద్రపురం గ్రామాల వద్ద భారీవృక్షాలు నేలకూలడంతో వాహనాలు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వరహా, సర్పా నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి.

అచ్యుతాపురం మండలం పూడిమడక వద్ద సముద్రంలో అలలు తాకిడి పెరిగింది. జిల్లా ప్రత్యేక అధికారి వాడ్రేవు వినయ్‌చంద్, పరవాడ డీఎస్పీ విష్ణుస్వరూప్, పలువురు అధికారులు ఇక్కడకు వచ్చి తుఫాన్ రక్షిత భవనాలను పరిశీలించారు.

మునగపాక గొల్లపేటలో రెండు పెంకుటిళ్లు కూలిపోయాయి. ఒంపోలులో భారీ వృక్షం రోడ్డుకు అడ్డంగా కూలిపోయింది. అధికారులు రంగంలోకి దిగి యుద్ధప్రాతిపదికన తొలగించారు.

రాంబిల్లి మండలంలో మేజర్, మైనర్ శారదా నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ కొత్తూరు, నారాయణపురం గ్రామాల వద్ద నదులను పరిశీలించారు.

ఎలమంచిలిలో మంగళవారం మధ్యాహ్నం నుంచి ఈదురు గాలులతో ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తున్నది. లోతట్టు కాలనీలు జలమయం అయ్యాయి. పూరిళ్లు, శిథిలావస్థకు చేరిన ఇళ్లల్లో నివాసం వుంటున్న వారిని పునరావాస కేంద్రాలకు తరలించి భోజన ఏర్పాట్లు చేశారు. మండలంలో వరహా, శారదా నదులు వరద నీటితో పరవళ్లు తొక్కుతున్నాయి.

రవాణా వాహనాలు నిలిపివేత

... 5వ పేజీ తరువాయి

హెచ్చరించడంతో ఎటువంటి ప్రమాదాలు జరగకుండా వుండడానికి వాహనాలను నిలిపివేస్తున్నట్టు డ్రైవర్లకు పోలీసులు వివరిస్తున్నారు. కొన్నిచోట్ల ఆహారం, తాగునీరు అందజేస్తున్నారు. కశింకోట సీఐ అల్లు స్వామినాయుడు నక్కపల్లి సీఐ ఎల్.రామకృష్ణ, పాయకరావుపేట సీఐ జి.అప్పన్న ఆయా ప్రదేశాల వద్ద పర్యవేక్షిస్తున్నారు.



పాయకరావుపేట వద్ద రవాణా వాహనాలను ఆపేసిన పోలీసులు

తుఫాన్ బీభత్సం

బంగాళాఖాతంలో ఏర్పడిన 'మొంథా' తీవ్ర తుఫాన్ జిల్లాపై తీవ్ర ప్రభావం చూపుతున్నది. సోమవారం అర్ధరాత్రి నుంచి మంగళవారం అర్ధరాత్రి వరకు దఫదఫాలుగా భారీ వర్షం కురుస్తున్నది. తుఫాన్ తీరం దాటిన తరువాత కూడా ఇదే పరిస్థితి కొనసాగుతున్నది. భారీ వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. నదులు, వాగులు, గెడ్డలు వరద నీటితో ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఈదురు గాలులు వీస్తుండడంతో పలుచోట్ల చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది వెంటనే రంగంలోకి దిగి చెట్లను తొలగిస్తున్నారు.



చోడవరంలో నీటమునిగిన కో-ఆపరేటివ్ కాలనీ



కోటవురట్ల మండలం రామన్నపాలెంలో కూలిన ఇల్లు



మాకవరపాలెంలో కురుస్తున్న వర్షం



అచ్యుతాపురం మండలం పూడిమడక తీరంలో ఎగిసి పడుతున్న అలలు



వర్షం నీటితో చెరువును తలపిస్తున్న అనకాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణ



చోడవరం మండలం జన్నవరం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న పెద్దేరు నది



ఎలమంచిలి మండలం జంపపాలెం గ్రోయిన్ వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న శారదా నది

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

కొత్త తేదీన ఆర్యన్




విష్ణు విశాల్ కథానాయకుడిగా నటించిన 'ఆర్యన్' చిత్రం విడుదల కొత్త తేదీకి మారింది. ముందు ప్రకటించిన విధంగా ఈ నెల 31న ఈ చిత్రం విడుదలవ్వడం లేదు. ఒక వారం ఆలస్యంగా నవంబర్ 7న 'ఆర్యన్' చిత్రాన్ని విడుదల చేయాలని నిర్ణయించుకున్నట్లు విష్ణు విశాల్ తెలిపారు. 'రవితేజ నటించిన 'మాస్ జాతర', 'బాహుబలి: ది ఎపిక్' చిత్రాలు కూడా ఈ నెల 31న విడుదలవుతున్నాయి. రవితేజతో నాకున్న స్నేహం, రాజమౌళిపై గౌరవంతో ఈ నిర్ణయం తీసుకున్నాం' అని ఆయన తెలిపారు. అయితే 'ఆర్యన్' తమిళ వెర్షన్ మాత్రం ఈ నెల 31నే విడుదలవనుంది. ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన 'ఆర్యన్' చిత్రానికి ప్రవీణ్ కె దర్శకుడు. శుభ్ర, ఆర్యన్ రమేశ్ నిర్మించారు. శ్రద్ధా శ్రీనాథ్ కథానాయిక. సెల్వ రాఘవన్ కీలకపాత్ర పోషించారు. శ్రేష్ట మూవీస్ అధినేత సుధాకర్ రెడ్డి ఈ చిత్రాన్ని తెలుగు రాష్ట్రాల్లో విడుదల చేస్తున్నారు.



ఉగాదిన విడుదల

అడివి శేష్ కథానాయకుడిగా షానియల్ డియో తెరకెక్కిస్తోన్న రొమాంటిక్ యాక్షన్ థ్రిల్లర్ 'డెకాయిట్'. అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో సుప్రియ యార్లగడ్డ తెలుగు, హిందీ భాషల్లో నిర్మిస్తున్నారు. సునీల్ నారంగ్ సహ నిర్మాత. మొదట డిసెంబరు 25న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. కానీ కొన్ని అనివార్య కారణాల వల్ల వాయిదా పడింది. తాజాగా మేకర్స్ కొత్త తేదీని ప్రకటించారు. 2026 ఉగాది పండగ సందర్భంగా మార్చి 19న థియేటర్లలోకి రానున్నట్లు తెలిపారు. ఈ మేరకు సంబంధిత పోస్టర్‌ని అడివి శేష్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. 'ఈసారి మామూలుగా ఉండదు. ముందుకి వెళ్లడమే తప్ప వెనక్కి చూడాల్సిన అవసరమే లేదు' అని క్యాప్షన్ పెట్టారు. కాగా, అడివి శేష్ సరసన కథానాయికగా మృణాల్ ఠాకూర్ నటిస్తున్నారు. బాలీవుడ్ దర్శకుడు, నటుడు అనురాగ్ కశ్యప్ కీలక పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రానికి భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు.

శ్రీకాంత్ తివారి వచ్చేస్తున్నాడు



ఓటీటీ ప్లాట్‌ఫామ్‌పై ఓ సరికొత్త ఒరవడిని సృష్టించిన వెబ్ సిరీస్ 'ది ఫ్యామిలీ మ్యాన్'. ఇప్పటి వరకూ రెండు సీజన్లు విజయవంతంగా పూర్తి చేసుకున్న ఈ స్పై యాక్షన్ థ్రిల్లర్ సిరీస్‌లో మూడో భాగం సిద్ధమైంది. మనోజ్ బాజ్‌పాయ్, ప్రియమణి ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సిరీస్‌ను రాజ్ అండ్ డీకే తెరకెక్కించారు. ఈ ప్రాజెక్టును ప్రకటించినప్పటి నుంచి స్ట్రీమింగ్ వివరాల కోసం అభిమానులు ఎంతగానో ఆసక్తిగా ఎదురుచూడసాగారు. తాజాగా మేకర్స్ స్ట్రీమింగ్ తేదీని ప్రకటించారు. ఆమెజాన్ ప్రైమ్‌లో నవంబరు 21 నుంచి అందుబాటులోకి రానున్నట్లు వెల్లడించారు. దీనికి సంబంధించిన ఓ వీడియోను కూడా షేర్ చేశారు. థ్రెట్ అనాలిసిస్ అండ్ సర్వైవలెన్స్ సెల్(టాస్క్) సీనియర్ ఆఫీసర్ శ్రీకాంత్ తివారి పాత్రలో మనోజ్ బాజ్‌పాయ్ మరోసారి అలరించనున్నారు. రెండు సీజన్లలో మనోజ్ బాజ్‌పాయ్ నటనకు ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు లభించాయి. ఇప్పుడు మూడో భాగంలో ఆయన నటనపై అభిమానుల్లో అంచనాలు పెరిగాయి. తెలుగు, హిందీ, తమిళం, మలయాళం భాషల్లో ఈ సిరీస్ అందుబాటులో ఉంటుంది.

చట్టమా? విశ్వాసమా?



యామీ గౌతమ్, ఇమ్రాన్ హష్మీ ప్రధాన పాత్రలు పోషించిన చిత్రం 'హక్'. ముస్లిం మహిళల హక్కుల పోరాటంలో మైలురాయిగా నిలిచిన 'మొహమ్మద్ అహ్మద్ ఖాన్ వర్సెస్ షా బానో బేగం' కేసు ఆధారంగా రాసుకున్న కథతో దర్శకుడు సుపర్ణ్ వర్మ ఎస్ తెరకెక్కించారు. నవంబర్ 7న ఈచిత్రం విడుదలవుతోంది. హర్మాన్ బవేజా, విశాల్ గుర్నాని నిర్మించారు. మేకర్స్ మంగళవారం ట్రైలర్‌ను విడుదల చేశారు. చట్టం, విశ్వాసం, న్యాయం మధ్య సంఘర్షణ ప్రధానాంశంగా దర్శకుడు కథను మలచిన తీరు ఆకట్టుకుంటోంది. షాబోనో బేగం పాత్రలో యామీ గౌతమ్, ఆమె భర్తగా ఇమ్రాన్ హష్మీ తమదైన శైలిలో నటించి మెప్పించారు.

నటులకూ ఎనిమిది గంటల షిఫ్ట్ కావాలి

దేశవ్యాప్తంగా సినీ రంగంలో చర్చనీయాంశమైన పనివేళల అంశంపై కథానాయిక రష్మిక మందన్న స్పందించారు. వరుస పాన్ ఇండియా చిత్రాలతో బిజీగా ఉన్న రష్మిక తాను కూడా అధిక పని ఒత్తిడిని అనుభవిస్తున్నట్లు అంగీకరించారు. 'ది గర్ల్‌ఫ్రెండ్' చిత్రం ప్రచార కార్యక్రమాల్లో భాగంగా ఆమె మాట్లాడుతూ... రోజుకు పది పన్నెండు గంటలకు మించి పనిచేయడం ఎంత కష్టమో, కుటుంబ, వ్యక్తిగత జీవితానికి సమయం కేటాయించడం ఎంత అవసరమో ఆమె వివరించారు. 'నేను కూడా ఎక్కువగంటలు పనిచేస్తున్నాను. ఇది ఆరోగ్యానికి మంచిది కాదు. ఇలా చేయవద్దని అందరికీ చెబుతున్నాను. ఆఫీసులో ఉద్యోగులకు ఉన్నట్లే నటీనటులకూ ఎనిమిది గంటల షిఫ్ట్ ఉండాలి' అని రష్మిక అభిప్రాయపడ్డారు. ఒక షెడ్యూల్ పెట్టుకొని రోజుకు 8 గంటలు కంటినిండా నిద్రపోవాలి, వృత్తిని వ్యక్తిగత జీవితాన్ని బేలన్స్ చేసుకోవాలని ఆమె సూచించారు. నిర్ణీత పనివేళల డిమాండ్‌తో దీపికా పదుకొనే కొన్ని సినిమాల నుంచి వైదొలగినప్పటి నుంచి పలువురు నటీనటులు ఈ అంశంపై భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు.



నా కోసం ఆ వెన్నెల



ప్రేమలోని విభిన్న కోణాలను ఆవిష్కరిస్తూ తెరకెక్కిస్తోన్న చిత్రం 'ఓ చెలియా'. నాగప్రణవ్, కావేరి కర్ణిక, ఆద్య రెడ్డి ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. ఇందిరా దేవి ప్రొడక్షన్స్ పతాకంపై రూపాశ్రీ కొపురు నిర్మిస్తున్నారు. ఎం. నాగ రాజశేఖర్‌రెడ్డి దర్శకుడు. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. 'నా కోసం ఆ వెన్నెల' అంటూ సాగే ప్రేమగీతాన్ని నటుడు జేడీ చక్రవర్తి చేతుల మీదుగా మేకర్స్ విడుదల చేశారు.. హీరో హీరోయిన్ల అనుబంధాన్ని వివరిస్తూ సాగే ఈ గీతానికి శివ సాహిత్యం అందించగా, ఎం.ఎం కుమార్ స్వరపరిచారు. మేఘన, మనోజ్ ఆలపించారు.

రెహమాన్ సంగీత విభావరి



ప్రముఖ సంగీత దర్శకుడు ఏ.ఆర్.రెహమాన్ తన సంగీత విభావరితో మరోసారి హైదరాబాద్ ప్రేక్షకులను అలరించబోతున్నారు. 'హైదరాబాద్ టాకీస్' ఆధ్వర్యంలో నవంబరు 8న రామోజీ ఫిలిం సిటీలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా తెలుగు ప్రేక్షకులతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేస్తూ ' తెలుగు సినిమాలు చేస్తూనే పెరిగాను. 'ఏ మాయ చేశావే' మొదలు ఇటీవల రామ్ చరణ్ సినిమా వరకు ఇక్కడి ప్రేక్షకులు నన్ను ఎంతగానో ఆదరించారు. ఇప్పుడు హైదరాబాద్ ప్రజలు నా కచేరీని గొప్పగా ఆస్వాదిస్తారని భావిస్తున్నా.' అని అన్నారు. కచేరీలో తన బాణీల గురించి వివరిస్తూ 'నాకు పాత స్వరాలను అనుసరించే సమయం లేదు. కొత్త అనుభూతి కోసం 'రోజా' లాంటి క్లాసిక్స్‌ని డాల్బీ అట్మోస్‌లో రీమిక్స్ చేస్తున్నాను. ఇప్పుడు సంగీతం గ్లోబల్ అయిపోయింది. ఎవరు ఏ భాషలో ఆస్వాదిస్తున్నారో ఎవరూ చెప్పలేరు. సంగీతంలో కొత్తదనం, స్పష్టత ముఖ్యం. అది ప్రేరేపించే భావోద్వేగం అన్నింటి కంటే మరీ ముఖ్యం' అని వివరించారు. కాగా, 2017లో హైదరాబాద్‌లో నిర్వహించిన ఓ భారీ కచేరీలో రెహమాన్ ప్రేక్షకులను 'మా తుజే సలామ్' పాటతో ఉర్రూతలూగించారు. మళ్లీ ఇన్నేళ్లకు సంగీత ప్రియులను అలరించబోతున్నారు.